## కిక్ బాక్సింగ్ క్రీడాకారినికి "సత్యం వాసంశెట్టి ఫౌండేషన్" ఆర్థిక సహాయం



**రామచంద్రపురం,మార్చి 11 (వార్తాప్రభ) :** క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు నిర్మించుకోవచ్చని, విద్యతోపాటు క్రీడలకు కూటమి ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తున్నదని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్,రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం అన్నారు. రామచంద్రపురం నుంచి అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన పేద కుటుంబానికి చెందిన వడ్డాది నళినికు "సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా కిక్ బాక్సింగ్ పోటీలకు సంబంధించిన ఫీజులో 20 శాతం నిధులను ఆర్థిక సహాయంగా సత్యం అందించారు. అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు సన్నద్ధమవుతున్న నళిని రామచంద్రపురంతో పాటు,రాష్ట్రానికి, దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆశీస్సులు అందజేశారు. విద్యార్థులకు ఒత్తిడి లేని విద్య అందించడంతోపాటు, క్రీడలకు సమయం కేటాయించాలని తద్వారా శారీరక దృఢత్వం,మానసిక ఒత్తిడిను దూరం చేయవచ్చని ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం అన్నారు.

## పిఠాపురానికి పాదయాత్ర




**ఉయ్యూరు,మార్చి 11 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా ఉయ్యూరు పట్టణంలో ఆటోనగర్ ఎర్పాటుచేయాలని కోరుతూ స్థానిక జన సైనికుడు ఉయ్యూరు నుండి పిఠాపురంకు పాదయాత్ర గా తరలివెళ్ళాడు. పిఠాపురంలో జరగనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవం సభలో జనసేనాని ,డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి ఉయ్యూరులో ఆటోనగర్ ఎర్పాటు సమస్యను తీసుకువెళ్లేందుకు ఉయ్యూరు లో వెల్డింగ్ వర్కర్ , జన సైనికుడు గోపరాజు వినయ్ కుమార్ ఈ పాదయాత్ర చేపట్టారు.సోమవారం రాత్రి ఉయ్యూరులో వెల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.వి.సుబ్బారావు పలువురు జనసేన స్థానిక నాయకులు,కార్మికులు పాదయాత్ర చేపట్టిన వినయ్ ను అభినందించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ ఉయ్యూరు లో వెల్డింగ్,మెకానిక్ కార్మికులు సుదీర్ఘ కాలంగా డిమాండ్ చేస్తున్న ఆటోనగర్ ఎర్పాటు పై గతంలో ప్రభుత్వాలకు విజ్ఞప్తులు చేసిన సమస్యకు పరిష్కారం లభించలేదని తెలిపారు. తన పాదయాత్ర ద్వారా పిఠాపురంలో జరిగే జనసేన ప్లీనరీ సమావేశాలలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి ఉయ్యూరులో ఆటోనగర్ ఎర్పాటు అవసరాన్ని తీసుకెళ్తే అయినా తమ కార్మికులకు సమస్య పరిష్కారం అవుతుందని ఆశాభావంతో ఉయ్యూరు నుంచి పిఠాపురం వరకు పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తమ సమస్య గుర్తించి ఆటోనగర్ ఏర్పాటుకు ప్రభుత్వం ద్వారా స్థలాన్ని కేటాయింపచేయిస్తారని ఆశాభావంతో ఒక జన సైనికుని గా జనసేనా ప్లీనరికి పాదయాత్ర గా తరలివెళ్తునట్టు వినయ్ కుమార్ తెలిపారు.

## అసంఘటిత రంగ కార్మికులు ఈ శ్రమ కార్డు ప్రయోజనాలు పొందాలి : మల్లాడి



**కాకినాడ,మార్చి 11 (వార్తాప్రభ) :** అసంఘటిత రంగంలో పనిచేస్తున్న చేతి వృత్తులవారు, ఆటో, టాక్సీ, లారీ డ్రైవర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, టైలర్లు, ఇళ్ల వద్ద పనిచేసే మహిళలు, డెలివరీ బాయ్స్, గుర్తింపు లేని కార్మికులు అందరూ కూడా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ – శ్రమ పోర్టల్ లో రిజిస్ట్రేషన్ చేసుకుని పథకం ప్రయోజనాలు పొందాలని కాకినాడ జనసేన నాయకులు, మల్లాడి రామారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డా. మల్లాడి రాజేంద్ర ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా కార్మిక శాఖ కార్యాలయం వద్ద ఆ శాఖ అధికారులతో ఈ శ్రమ పథకం ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు గొప్ప వరం లాంటిదని, గుర్తింపు లేని పనులకు నమోదు ప్రక్రియ ద్వారా ప్రభుత్వం గుర్తింపు కార్డు ఇస్తుందని, ఇది దేశంలో ఎక్కడైనా చెల్లుతుందన్నారు. అంతే కాకుండా ఈ పథకంలో 2 లక్షలు ప్రమాద భీమా సౌకర్యం కూడా ఉందన్నారు. ఈ శ్రమ కార్డు నమోదు విషయంలో సూచనల కోసం మల్లాడి ట్రస్ట్ ను సంప్రదించవచ్చని తెలిపారు. మన ప్రధాని మోదీ, రాష్ట్ర సిఎం, డిప్యూటీ సిఎం ఆద్వర్యంలో కార్మికుల సంక్షేమానికి గొప్ప సంకల్పంతో కృషి చేస్తున్నారని ఈ అవకాశాన్ని కార్మికులు, కర్షకులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక కమిషనర్ ఎన్.బుల్లి రాణి, సీనియర్ అసిస్టెంట్ ప్రసన్న, జూనియర్ అసిస్టెంట్లు రావు, వంశీకృష్ణ, మూర్తి, అటెండర్లు శ్రీను, కుమార్, లత, తలుపులమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దాతృత్వం చాటుకున్న గ్రామీణ వైద్యుడు



**నందిగామ,మార్చి 11 (వార్తాప్రభ) :** మండల పరిధిలోని కొణతమాత్మకూరు జిల్లా పరిషత్ హై స్కూల్ నందు పదవ తరగతి చదువుతున్న 42 మంది విద్యార్థిని విద్యార్థులకు దాములూరు గ్రామీణ వైద్యుడు ఇనుపనూరి రామస్వామి పెన్నులు, ప్యాడ్లు గిఫ్ట్ గా ఇచ్చారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో రామస్వామి మాట్లాడుతూ మంచిగా చదివి త్వరలో జరుగు జరగనున్న పదవ తరగతి పరీక్షలలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణతను సాధించి స్కూలుకు సమాజానికి,దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన విద్యార్థులను కోరారు.ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# భారీ స్థాయిలో జనసేన సభ

● రాష్ట్రం దివాళాకు జగన్ వైఖరే కారణం ● మంత్రులు నాదెండ్ల, దుర్గేష్



**కాకినాడ,మార్చి 11 (వార్తాప్రభ) :** ఈనెల 14వ తేదీన పిఠాపురం నియోజకవర్గం లోని చిత్రాడ గ్రామంలో నిర్వహించనున్న జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభకు భారీ ఎత్తున ఏర్పాట్లను చేస్తున్నామని ఈ సభకు లక్షలాది మంది జనసైనికులు హాజరవుతారని మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ వెల్లడించారు. ఈ సభకు సంబంధించి అన్ని ఏర్పాట్లను ఆయా కమిటీలు పకడ్బందీగా చేస్తున్నాయని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వారు చెప్పారు. మంగళవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్థానికంగా విలేకరులతో సమావేశాన్ని నిర్వహించి ఆవిర్భావ సభ ఏర్పాట్లను వివరించారు. ఈ సందర్భంగా మంత్రులు నాదెండ్ల, కందులలు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వంలో ఉండి ఈ సభను నిర్వహిస్తున్నామని దీనికి అధిక సంఖ్యలో హాజరవ్వడానికి తగు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సభ ప్రాంగణంతో పాటు పలు చోట్ల వైద్య శిబిరాలు, తాగునీరు, భోజన సదుపాయం, ఎల్ఈడి స్క్రీన్స్, మరుగు వంటివి ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న జనసేన అధినేత పవన్ అభిమానులు, జనసైనికులు ఈ సభకు లక్షల్లో హాజరవుతారని మనోహర్, దుర్గేష్లు చెప్పారు. ఈ సభ ద్వారా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మంచి సందేశాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 12న వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టే యువత పోరుపై వారు స్పందించారు. యువతతో పాటు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్ ఇప్పుడు ఫీజు పోరు అంటూ కొత్త నాటకానికి తెరలేపారన్నారు. రాష్ట్రం నాశనం అవ్వడానికి జగన్ వైఖరి కారణమని వారు చెప్పారు. వ్యవస్థలను సర్వనాశనం చేసిన జగన్ ప్రభుత్వానికి యువత, మహిళలు, రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పారని కందుల, నాదెండ్లలు అన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పి హరిప్రసాద్, ఎమ్మెల్యేలు పంతం నానాజీ, పత్సమట్ల ధర్మరాజు స్థానిక నాయకులు తలాటం సత్య, చోడిశెట్టి శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లి వెంకటేశ్వరరావు స్వామి ఉత్సవాలు



**అమలాపురం,మార్చి 11 (వార్తాప్రభ) :** ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలో వేం చేసియున్న శ్రీ వెంకటేశ్వరస్వామి వారి తీర్థ కళ్యాణ మహోత్సవాలు ఏప్రిల్ 7వ తేదీ నుండి 13వ తేదీ వరకు అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు మాదిరిగా అధికారుల సమన్వయంతో ఘనంగా నిర్వహించి విజయవంతం గావించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ జిల్లా అధికారులకు పిలుపునిచ్చారు. కలెక్టరు కార్యాలయం నందు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి తీర్థ కళ్యాణ మహోత్సవాలు సన్నద్ధతపై దేవాదాయ, పోలీసు రెవెన్యూ,తదితర అధికారులతో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రియల్ 7 వ తేదీన సోమవారం ధ్వజారోహణ కార్యక్రమం 8వ తేదీన మంగళవారం స్వామి వారి తీర్థం రథోత్సవం, కళ్యాణం కార్యక్రమాలను,9వ తేదీ బుధవారం స్వామి వారి పొన్న వాహన సేవ, 11వ తేదీ శుక్రవారం గోదావరి నదిలో తెప్పోత్సవం,12వ తేదీ శనివారం మహా పూర్ణాహుతి చక్రస్నానం కార్యక్రమాలు ఉంటాయన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ భక్తుల సౌకర్యార్థం పోలీసు వారి పరివేక్షణలో పటిష్టమైన క్యూలైన్లను తొక్కిసలాటకు ఆస్కారం లేకుండా నిర్వహించాలన్నారు. వికలాంగులకు వృద్ధులకు గర్భిణీ స్త్రీలకు ప్రత్యేక దర్శన ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని కమాండ్ కంట్రోల్ రూమ్ కు అనుసంధానం చేస్తూ అందరికీ వినిపించే విధంగా సౌండ్ సిస్టం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్సులు భక్తుల సౌకర్యార్థం నడపాలని వాహనాలకు పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కళ్యాణోత్సవాల సందర్భంగా ఏపీ ట్రాన్స్కో వారు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. ఆర్డబ్ల్యూఎస్ వారు తగినన్ని తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతోపాటు త్రాగునీటిని సమృద్ధిగా భక్తులకు పంపిణీ చేయాలన్నారు.భక్తుల సౌకర్యార్థం ఆర్ అండ్ బి వారు క్యూ లైన్లు బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య వ్యవస్థను పర్యవేక్షించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ తగు చర్యలు చేపట్టాలన్నారు. తెప్పోత్సవానికి గోదావరి నదిలో బోట్లు,గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని మత్స్య శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, జాయింట్ కలెక్టరు టి.నిషాంతి,దేవస్థాన కార్యనిర్వహణాధికారి చక్రధరరావు,జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ, ఆర్డీవోలు పి.శ్రీకర్, కె. మాధవి డి.అఖిల, తాహశీల్దారు రాజేశ్వరరావు వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ సి డి సర్వే నిర్వహిస్తున్న ఆరోగ్యశాఖ



**విస్సన్నపేట,మార్చి 11 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వల ఆదేశాలతో నిర్వహిస్తున్న ఎన్ సి డి సర్వే ఆరోగ్యశాఖ సిబ్బంది మండల మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహి స్తున్నారు. క్యాన్సర్ పై అవగాహన కల్పిస్తూ క్యాన్సర్ నివారణకు ఆరోగ్య కరమైన సంపూర్ణమైన పోషకాహారం పండ్లు కూరగాయలు చిరుధాన్యాలు మొదలైనవి తీసుకోవాలని ప్రతిరోజు వ్యాయామం చేయాలని వ్యక్తిగత పరిశుభ్రత అవసరమని పిల్లల తల్లులు వీలైన తక్కువ కాలం పిల్లలకు పాలు ఇవ్వాలని ఈ ప్రక్రియ వలన బిడ్డతో పాటు తల్లికి కూడా శ్రేయస్కరమని సిహెచ్ఓ సంధ్య ఏఎన్ఎంలు సుభద్ర మస్తాన్ బీలు అవగాహన కల్పించారు. 18 సంవత్సరాల దాటిన తర్వాత పురుషులకు స్త్రీలకు ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించే లక్ష్యంగా ఇంటింటి సర్వే చూస్తున్నామని పురుషులు ధూమపానం చేయరాదని గుట్కా కైని తంబాకు పాన్ వంటివి నమల వద్దని మద్యం సేవించరాదని అనురక్షిత లైంగిక విధానాలకు మరియు బహుళ లైంగిక సంబంధాలకు దూరంగా ఉండాలని ముందస్తు పరీక్షల వలన క్యాన్సర్ వంటి మహమ్మారి నుండి రక్షణ పొందవచ్చని ప్రభుత్వ ఆదేశాలతో ఇంటి వద్దనే పరీక్షలు నిర్వహిస్తున్నామని వారు తెలియజేశారు. ముందస్తుగా గుర్తించటం వలన కూడా క్యాన్సర్ ను సులభంగా తరిమికొట్టవచ్చని వాటి లక్షణాలు ప్రమాద కారకాలు పురుషులకు స్త్రీలకు తెలియజేశారు. పిల్లల తల్లులు పిల్లలకు పాలు ఇవ్వకపోవడం వలన లేదా తక్కువకాలం ఇవ్వటం ఎక్కువ కాలం గర్భనిరోధక మాత్రలు వాడటం రక్తసంబంధికులకు ఎవరికైనా రొమ్ము క్యాన్సర్ కలిగి ఉండటం రుచి చక్రం ఆలస్యంగా ఆగిపోవడం( 55 సంవత్సరాల దాటిన తర్వాత) తదితర ప్రమాద కారకాల వలన క్యాన్సర్ ఛాయలు కనపడే అవకాశాలు ఉన్నాయని రొమ్ము లేదా సంకలో వాపు లేదా గడ్డ రొమ్ము సైజు లేదా ఆకారంలో మార్పులు రొమ్ము లేదా చనుమొన చర్మంలో మార్పులు లేదా వాటి నుండి ద్రవాలు కారటం ఉన్నట్టుండి బరువు తగ్గటం తదితర లక్షణాలు కనబడితే క్యాన్సర్ ఛాయలు గా గుర్తించవచ్చన్నారు. వెనువంటనే ఆరోగ్య శాఖ సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో అవగాహన కల్పించి పరీక్షల అనంతరం ఆన్లైన్ నమోదు వివరాలతో వెబ్ పేజీ నింపిన అనంతరం పరీక్షలను నిర్వహించిన వారి ఓటీపీ ఆరోగ్య సిబ్బంది ట్యాబ్ లో పొందుపరిచి తద్వారా వచ్చిన ఆయుష్మాన్ భారత్ కార్డును నెంబర్ను అందించడం జరుగుతుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు మాధవి శైలజ చిన్నమ్మ తిరుపతమ్మ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్లకు కళ్లజోళ్ళు పంపిణీ..



**కాకినాడ,మార్చి 11 (వార్తాప్రభ) :** రవాణ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న లారీ డ్రైవర్లకు ఇటీవల నిర్వహించిన కంటి పరీక్షల్లో కళ్ళజోళ్ళు అవసరమైన వారికి సానా సతీష్ బాబు ఫౌండేషన్ ద్వారా ఉచిత కళ్ళజోళ్ళు పంపిణీ జరిగింది. రహదారి భద్రతా మాసోత్సవాలలో రవాణా శాఖ ఆధ్వర్యంలో ఇటీవల కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. రవాణా ఉప కమీషనర్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో డిటీసీ శ్రీధర్, సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ వీటిని 60మందికి పంపిణీ చేశారు. కార్యక్రమానికి మోటారు వెహికల్ ఇనస్పెక్టర్ మురళీకృష్ణ అధ్యక్షత వహించగా డి.టి.సి. శ్రీధర్ ముఖ్యఅతిథిగా సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ విశిష్ట అతిథిగాను ఆర్.టి.ఓ. జి.వి.శివారెడ్డి, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దాసరి శ్రీనివాసరావు, ఫౌండేషన్ నాయకులు కె.వి. సత్యనారాయణ, న్యూటన్ ఆనంద్, పిడక శేషు, చలపతి, శేషు, స్పోర్ట్స్ శ్రీను రవాణశాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## సహదేవతలకు 25 వేల వెండి వస్తువులు అందజేత



**పెనుగంచిప్రోలు,మార్చి 11 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామస్తులైన కన్నీటి వెంకటరమణ ధర్మపత్నీ విజయలక్ష్మి శ్రీ తిరుపతమ్మ అమ్మవారి సహదేవతలైన శ్రీ వినుకొండ అంకమ్మ, శ్రీ మద్దిరావమ్మ , శ్రీ పెద్దమ్మ అమ్మవారికి సుమారు 25వేల రూపాయలు విలువచేసే వెండివస్తువులను కార్యనిర్వహణధికారి కిశోర్ కు మార్ కి సోమవారం అందజేశారు. వారికి దేవస్థానం తరుపున దర్శనం కల్పించి ఆశీర్వచనం చేసి శేష వస్త్రాలు తీర్థప్రసాదాలు అందించడం జరిగినది ఆని డిప్యూటీ కమిషనర్ మరియు కార్యనిర్వహణధికారి కిషోర్ కుమార్ తెలిపారు.

## మాజీ సైనికుల రాష్ట్ర అధ్యక్ష పదవికి గరిమెళ్ళ శివ నాగేశ్వర రావు నామినేషన్ దాఖలు....



**విజయవాడ,మార్చి 11 (వార్తాప్రభ) :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్ష పదవికి ఈ నెల 23 వ తేదీన విజయవాడ స్వాతంత్ర సమర యోధులు భవనం లో ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్ర అధ్యక్ష పదవికి ఎన్టీఆర్ జిల్లా నెక్స అధ్యక్షులు గరిమెళ్ళ శివ నాగేశ్వర రావు రాష్ట్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రాష్ట్ర అడహక్ కమిటి కో. ఆర్డినేటర్ కె. గోవిందా రావు కు ఎన్నికల కార్యాలయం లో నామినేషన్ పత్రాలు అందజేశారు. ట్రెజరర్ పదవి కి ఉమామహేశ్వర రావు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు,ఉమామహేశ్వర రావు, గుప్తా, వేంకటేశ్వర రావు,ఈ.వి.రావు,పాల్గొన్నారు.

## విశ్రాంత సిండికేట్ బ్యాంక్ మేనేజర్ బట్ట గాని కమలాకర్ దైవ ఐక్యం



**విస్సన్నపేట,మార్చి 11 (వార్తాప్రభ) :** స్థానిక సిండికేట్ బ్యాంకు విశ్రాంత మేనేజర్ బట్టగాని కమలాకర్ హైదరాబాద్ ఆసుపత్రి నందు హృదయ సంబంధిత చికిత్స పొందుతూ దైవ ఐక్యం చెందినట్లు తాతకుంట్ల ఎంపిటిసి మేడా తిరుపతిరావు మీడియా సమావేశంలో తెలియజేశారు. బీఎస్పీ రాష్ట్ర నాయకులైన ఆయనకు ముగ్గురు సంతానం అని వారిలో ఇద్దరు కుమార్తెలని తెలియజేశారు. సిండికేట్( కెనరా )బ్యాంకు ఇబ్బందితోపాటు తాత కుంట్ల విస్సన్నపేట ప్రాంతాలలో ఉన్న పలువురు పెద్దలు అల్లుడైన ఇంజనీర్ మేడ శ్రీనివాసరావు ను మరియు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## జనసేన బహిరంగ సభ బందోబస్తు ఏర్పాట్లు పరిశీలన



**పిఠాపురం,మార్చి 11 (వార్తాప్రభ) :** పిఠాపురం మండలం చిత్రాడ గ్రామం ఎస్బి వెంచర్స్ నందు ఈనెల 14న జరగబోయే జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏలూరు ఐజిపి జీవిజి అశోక్ కుమార్ సభా ప్రాంగణంలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు చేశారు.ఈ సభకు పెద్ద ఎత్తున జనసేన కార్యకర్తలు,ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున,ప్రజలకు శాంతి భద్రతలు మరియు ట్రాఫిక్ పరంగా ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేటట్లు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.సభా ప్రాంగణం,వేదిక, హెలిప్యాడ్,పార్కింగ్ స్థలాలు పరిశీలించిన అనంతరం కాకినాడ ఎస్డీపీవో, స్థానిక పోలీసు అధికారులకు కొన్ని ముఖ్యమైన సూచనలు చేశారు.అనంతరం కాకినాడ జిల్లాలోని పోలీసు అధికారులతో సమావేశమై బందోబస్తుపై చర్చించారు.ఈ బహిరంగ సభకు వచ్చే కార్యకర్తలకు, స్థానిక ప్రజలకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మళ్లించి,ఆర్టీసీ బస్సులు ప్రయాణించే మార్గాన్ని ముందుగా ప్రజలకు తెలియజేయమని సూచించారు.ఏ విధమైన అత్యవసరమైన పరిస్థితిని ఎదుర్కొనేందుకు గాను ఫైర్ డిపార్టుమెంట్, మెడికల్ డిపార్ట్మెంట్ లతో సంప్రదించి ఫైర్ ఇంజన్లు,అంబులెన్సులు ఏర్పాటు చేయమని సూచించారు.ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్,అదనపు ఎస్పీ పరిపాలన ఏంజెవి భాస్కర్,అదనపు ఎస్పీ ఏఆర్. శ్రీనివాస్,ఎస్డీపివో కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, పెద్దాపురం ఎస్డీపీవో, శ్రీహరి రాజు,ఏఆర్. డిఎస్పీ శ్రీహరి, పిఠాపురం సిఐ శ్రీనివాస్, ఇతర అధికారులు ఉన్నారు.

## సర్ సివి రామన్ విద్యార్థుల ప్రతిభ




**అమలాపురం,మార్చి 11 (వార్తాప్రభ) :** ప్రతిష్టాత్మక సుచిర్ ఇండియా ఫౌండేషన్ వారు నిర్వహించిన ఒలింపియాడ్ ఎగ్జామ్స్ లో సర్ సి.వి. రామన్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రథమ ద్వితీయ తృతీయ ర్యాంకులు సాధించారు. వీటితోపాటు రాష్ట్ర స్థాయిలో 100కు పైగా విద్యార్థులు స్టేట్ ర్యాంకులు , 300 పైగా డిస్ట్రిక్ట్ స్థాయి ర్యాంకులు సాధించి సర్ సివి రామన్ పాఠశాల ఖ్యాతిని ఇనుమడింప చేశారు.పాఠశాలకు వరుసగా మూడోసారిబెస్ట్ స్కూల్ అవార్డు రావడం, సర్ సివి రామ న్ విద్యార్థులు ఈ స్థాయి ప్రతిభను కనబరచడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని పాఠశాల డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు విద్యార్థులు అభినందించారు. పాఠశాలకు వరుసగా మూడోసారి బెస్ట్ స్కూల్ రావడం, విద్యార్థులు సాధించిన విజయం పట్ల తల్లితండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ వేణుగోపాలరావు, ప్రిన్సిపల్ ఎన్. శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ కె. పెద్దిరాజు పాల్గొన్నారు.

## అధిక ఉష్ణోగ్రతను లెక్కచేయని తిరువూరు ఆర్డీవో మాధవి



**విస్సన్నపేట,మార్చి 11 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో తిరువూరు ఆర్డీవో మాధవి మండుటెండను సైతం లెక్కచేయకుండా ఉదయం నుండి సాయంత్రం వరకు ఫీల్డ్ వెరిఫికేషన్ చేయడం జరిగింది. వీఆర్వోలతో సర్వేయర్లలతో సమావేశం రెవెన్యూ కార్యాలయం జరిగింది. ఇదే కార్యక్రమంలో ఏ కొండూరు రెడ్డిగూడెం మండలాల తాసిల్దార్ లు ఆర్డీవో తో పాల్గొన్నారు . మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయంలో చలివేంద్రంను ఆమె ప్రారంభించారు .ఇండస్ట్రియల్ మరియు ప్రభుత్వ అవసరాల నిమిత్తం ల్యాండ్ వెరిఫికేషన్ తో పాటు కొండ పర్వ లో నాలా ఫైల్ ఇన్స్పెక్షన్, నరసాపురం ఫీల్డ్ ఎంక్వైరీలతో పాటు 22 ఏ డిలేషన్ ఫైల్ ఎంక్వయిరీ నరసాపురం గ్రామంలో నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి డీటీ ఎం ప్రసాద్, రీ సర్వే డిటి భాస్కర్ ,ఆర్ ఐ సుజాత, సర్వే సిబ్బంది విఆర్వోలు పాల్గొన్నారు.

## ఎన్ఫోర్స్మెంట్ అధికారుల ఆకస్మిక దాడులు...

● 31 మద్యం బాటిళ్లు స్వాధీనం..



**పెడన,మార్చి 11 (వార్తాప్రభ) :** విజయవాడ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఎన్ఫోర్స్మెంట్ శ్రీనివాస చౌదరి ఆదేశాల మేరకు ఇన్స్పెక్టర్ పరసా వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో సిబ్బంది మచిలీపట్నం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల పల్లెతుమ్మలపాలెం గ్రామంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఒడుగు గోవింద రాజులు అనే వ్యక్తి వద్ద నుండి మొత్తం 31 మద్యం బాటిల్స్ ను స్వాధీన పరుచుకొని అతనిని అదుపులోనికి తీసుకొని కేసు నమోదు చేసి స్టేషన్ అప్పగించారు.ఈ దాడుల్లో సబ్ ఇన్స్పెక్టర్ ఎమ్ రామ శేషయ్య హెచ్ సి కే మధు మరియు సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు

## కార్పొరేటర్ ఉప్పలపాటి తో కలిసి ఏం.ఎల్. ఏ.గాంధీ ప్రత్యేక పూజలు.



**శేరిలింగంపల్లి,మార్చి 11 (వార్తాప్రభ):**మియాపూర్ డివిజన్ పరిధిలోని బికె ఎనక్లేవ్ కాలనీ లో గల శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం17 వ వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమంలో భాగంగా స్వామి వారి కల్యాణ మహోత్సవం కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని పీఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్,బికె ఎనక్లేవ్ కాలనీ అధ్యక్షులు నరేందర్ రెడ్డి ప్రతాప్ రెడ్డి,రాంభూపాల్ రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి,జనార్దన్ రెడ్డి టెంపుల్ కమిటీ సభ్యులు సాయికృష్ణన్,తిరుపతి నాయుడు,స్వామి నాయుడు వెంకటేశ్వర్లు,సదానందము,మనోహర్ సింగ్ మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజ్ గిరి రైల్వే స్టేషన్ లో మహిళా దినోత్సవ వేడుకలు

**మహిళా పారిశుద్ధ కార్మికులకు దుప్పట్లు పంపిణీ**

**మల్కాజ్‌గిరి మార్చి 11 (వార్తాప్రభ ప్రతినిధి):** నేడు మహిళలు అన్ని



రంగాల్లో రాణిస్తున్నారని దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ సీనియర్ సెక్షన్ ఇంజనీర్ కే భాగ్యం అన్నారు. పురుషులతో సమానంగా విధులు నిర్వహిస్తూ శెభాష్ అనిపించుకుంటున్నారని కొనియాడారు. మంగళవారం మల్కాజ్ గిరి రైల్వే స్టేషన్ లో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజ్ గిరి రైల్వే స్టేషన్ లో పనిచేస్తున్న మహిళా పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలను సత్కరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్కాజ్ గిరి రైల్వే స్టేషన్ లో మంగళవారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సబర్బన్ ట్రైన్ అండ్ బస్ ట్రావెల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జెడ్ ఆర్ యూ సి సి సభ్యులు నూర్ ఆద్వర్యంలో సౌత్ సెంట్రల్ రైల్వే మహిళా అధికారులు, అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్లు సుచరిత రెడ్డి, కే భాగ్యం, మల్కాజ్ గిరి టెలికాం అధికారిణి వందన , మల్కాజ్ గిరి లోని జ్యోతినగర్ లిల్లి మోడల్ హై స్కూల్ ప్రిన్సిపాల్ అజ్రా సయీద్, మల్కాజ్‌గిరి ఆర్పీఎఫ్ కు చెందిన సునీతను శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందచేశారు.డి ఆర్ యు సి సి హైదరాబాద్ డివిజన్ సభ్యులు పి భరద్వాజ్, అధ్యక్షుడు ఏ వి స్వామి , శంకర్ రావు, వై సుధ , వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు కొండంత అండ ముఖ్యమంత్రి సహాయ నిధి.

**శాసనసభ్యులు గాంధీ**



**శేరిలింగంపల్లి,మార్చి 11 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా ఇద్దరు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన 1,20,000/- ఒక లక్ష ఇరవై వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబాలకి అందచేసిన పీఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా పీఏసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పీఏసి చైర్మన్ గాంధీ పునరుద్ఘాటించారు.అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు,అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని..పీఏసి చైర్మన్ గాంధీ ఈ సందర్బంగా తెలియచేశారు.ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన పీఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధితుల కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ యాదవ్,శ్రీనివాస్ చౌదరి,కాశినాథ్ యాదవ్,తిరుపతి,ఉమాదేవి, మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ మహంకాళి అమ్మవారి విగ్ర ప్రతిష్ట



**శేరిలింగంపల్లి,మార్చి 11 (వార్తాప్రభ)** :మియా పూర్ డివిజన్ పరిధిలోని మియపూర్ లో గల శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ మహంకాళి



అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ మహో త్సవం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేకపూజలు చేసి,అన్నదానం కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాలు పీఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ వడ్డించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాంచందర్ ముదిరాజు,నాయకులు మోహన్ ముదిరాజ్, గంగాధర్,ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్,మహేందర్,తిమ్మరాజు మరియు భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి చూపడమే జవాబుదారీతనం!!

● రామగుండం రూపురేఖలు మారుస్తాం ● 15 కోట్ల రూపాయలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ● "బిజినెస్ హబ్"గా నవనిర్మాణం ● ప్రతిపక్షాల "పబ్లిసిటీ స్టంట్"లకు కాలం చెల్లు ● రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్






**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 11 (వార్తాప్రభ ప్రతినిధి)**అభివృద్ధి చూపడమే జవాబుదారీతనం అని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం గోదావరిఖని ప్రధాని చౌరస్తాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరైనారు. పూజా కార్యక్రమం అనంతరం నిర్మాణ పనులు ప్రారంభించి మీడియాతో మాట్లాడారు ఎమ్మెల్యే. ఎన్నికల ముందు రామగుండం ప్రజలకు హామీ ఇచ్చిన విధంగానే నేడు 15 కోట్ల రూపాయలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగనున్నదని తెలిపారు. నాలుగు వైపులా సేమ్ డిజైన్ తో ఉండే కమర్షియల్ కాంప్లెక్స్ ల వలన రామగుండం రూపురేఖలు మారిపోయి "బిజినెస్ హబ్"గా నవనిర్మాణం జరుగుతుంది అని అన్నారు. ప్రతిపక్షాల "పబ్లిసిటీ స్టంట్"లకు కాలం చెల్లు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఆర్జీవన్ జీఎం లలిత్ కుమార్, ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# "పోచమ్మ సాక్షిగా" సవాల్ సెన్సేషనల్!!

● తడి బట్టలతో గుడిలోకి కౌశిక్ హరి ● "హాట్ టాపిక్"గా మాస్ లీడర్ ధైర్య సాహసాలు ● ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో చర్చకు సిద్ధమా ● ధనం కోసం కాదు జనం కోసం నడుస్తున్నా ● బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కౌశిక హరి





**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 11 (వార్తాప్రభ ప్రతినిధి)** "పోచమ్మ సాక్షిగా" సవాల్ సెన్సేషనల్ అయ్యింది. సవాల్ విసిరిన కాంగ్రెస్ పార్టీ నాయకుల గుండెల్లో గుబులు పుట్టించినది. ముర్మూర్ అక్రమ మట్టి తరలింపుపై ఆరోపణలు చేసిన బీఆర్ఎస్ పార్టీ నేత కౌశిక హరి కేవలం డబ్బుల కోసమే బ్లాక్మెయిలింగ్ చేస్తున్నాడని, దమ్ము అలాగే ధైర్యం ఉంటే పోచమ్మ గుడిలో తడిబట్టలతో వెళ్లాలని సవాలు విసిరిన కాంగ్రెస్ పార్టీ నాయకుల సవాలును స్వీకరించి మంగళవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలోని పోచమ్మ గుడిలో తడి బట్టలతో ప్రత్యక్షమై గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి అనంతరం మీడియాతో మాట్లాడారు హరి. తాను ధనం కోసం కాదు జనం కోసం నడుస్తున్నానని మీడియా సాక్షిగా కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులకు, నాయకులకు తెలియజేశారు. అదే దమ్ము ధైర్యం ఉంటే కోదండ రామాలయంలో లేదా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో చర్చకు సిద్ధమా అని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులకు, నాయకులకు సవాల్ చేశారు. ప్రజల కోసం పోరాడుతూ, అక్రమ దందాలను బహిర్గతం చేస్తే ఆ నేపథ్యంలో పనికిమాలిన సవాల్లు విసిరితే జంకే నాయకుడడుని తాను కాదని స్పష్టం చేశారు. విషయ పరిజ్ఞానం లేని బచ్చా గ్యాంగ్ లతో మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి కౌంటర్లు ఇస్తే... ప్రజల్లో ఇలాగే చులకన అవుతారు తప్ప సాధించే ఏమీ లేదని అన్నారు.

# ఆధునిక యంత్రాలతో సమస్యలు పరిష్కారం!!

● పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక కృషి ● అధికారుల నుంచి కార్మికుని వరకు కష్టించి పని చేయాలి ● రామగుండం పేరు అగ్రభాగాన నిలబెట్టాలి ● ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్





**పెద్దపల్లి/ రామగుండం: మార్చి 11(వార్తాప్రభ ప్రతినిధి)**ఆధునిక యంత్రాలతో సమస్యలు పరిష్కారం అవుతుంది అని రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో 76 లక్షలతో కొనుగోలు చేసిన 2 పారిశుద్ధ విభాగానికి చెందిన వాహనాలు, 4 లక్షల 70 వేల రూపాయలతో కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రాలను అదనపు కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ అరుణశ్రీ తో కలిసి ప్రారంభం చేసి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నగరపాలక సంస్థ అధికారులు, కార్మికులకు పలు సూచనలను చేశారు. పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక కృషి చేస్తానని చెప్పారు. అధికారుల నుంచి కార్మికుని వరకు కష్టించి పని చేయాలి అని, రామగుండం పేరును రాష్ట్రంలో అగ్ర భాగాన నిలబెట్టాలని అన్నారు. శానిటేషన్ సిస్టం హై ఎండ్ గా ముందుకు సాగాలి అని తెలిపారు.

# గెలిస్తే గూడెంలో - ఓడితే యుగండాలో

- అఫిడవిట్ తో రాజకీయం - ప్రజల అభివృద్ధి యోగక్షేమాలు ఆయనకు పట్టవు
- ఆయనకు పదవే ముఖ్యం ప్రజలు ముఖ్యం కాదు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 11 (వార్తాప్రభ ప్రతినిధి)**కొత్తగూడెం : తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కొత్తగూడెం రాజకీయ నాయకులు ఉద్యోగస్తులు రైతులు వివిధ రంగాల కార్మికులు ప్రజలు అనేక ఉద్యమ పోరాటాలను ఇక్కడ నిర్వహించారు. రాష్ట్ర ప్రజల పోరాటాల ప్రతిఫలంగా 2014 సంవత్సరంలో ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ అవతరణ గావించింది. నాడు నాడు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలోకి ఓ కొత్త నాయకుడు సూట్కేస్ తో అరంగేట్రం చేశాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ముఖ్యమంత్రిగా పనిచేసిన ఓ మహనీయుని కుమారుడు ఆయన. అప్పుడు జరిగిన ఎన్నికల్లో తెలంగాణ వచ్చిందని అభిమానంతో నియోజకవర్గంలోని అన్ని రకాల ప్రజలు తమ అమూల్యమైన ఓటు వేసి ఆయనను గెలిపించారు. నాటి నుండి 5 సంవత్సరాలు పరిపాలించిన ఆయన ప్రజలకు వారి సమస్యలకు చేరువలో లేకుండా సమస్యలపై వచ్చిన బీద మధ్యతరగతి ప్రజలను పట్టించుకోకుండా పాలన నిర్వహించారు. వారి నివాస గృహం వద్దకు వచ్చి సమస్యను నేరుగా విన్నవించుకోవాలనే వారిని త్రిప్పి పంపిన సంఘటనలు ఉన్నాయి. ప్రభుత్వ బోర్డులో ఏర్పాటు - కొత్తగూడెం పట్టణంలోని నిరుపేద ప్రజలకు మధ్యతరగతి వారికి చెందిన ఇంటి స్థలాలలో ప్రభుత్వం వారి నుండి బోర్డులు పెట్టించిన ఘనత ఆయనకే దక్కింది. తమ సొంత భూములలో ప్రభుత్వ బోర్డులు ఏమిటని అడిగిన వారిని నోరు నొక్కిన సంఘటనలు లేకపోలేదు. ఈ బాధలు పడ్డ నియోజకవర్గ ప్రజలు 2018 లో జరిగిన ఎన్నికల్లో ఆయనను తిరిగి ఇంటికి పంపారు. ఆ ఎన్నికల్లో గెలిచిన వనమా వెంకటేశ్వరరావు పై హైకోర్టు సుప్రీంకోర్టులలో దావాలు వేసి అనేక ఇక్కట్లకు గురి చేశారు అంతేకాక నియోజకవర్గంలోని పరిపాలన సైతం అంతంతమాత్రంగానే సాగింది




ప్రజల అవసరాలు తీర్చవలసిన నాయకులు కోర్టులకు మాత్రమే పరిమితం అయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఐదు నియోజకవర్గాలలో కొత్తగూడెం మాత్రమే జనరల్ స్థానం కావడం వలన ఆయన చూపు ఇక్కడే ఉంది. గొప్ప వ్యక్తిత్వం మంచి సోదరా భావం స్నేహ సంబంధాలు కలిగిన రాజకీయ కుటుంబం ఆయనది. అది మరచి పూటకో పార్టీ రోజుకో కండువా కప్పుకొనే ఈ నాయకుడు తన తీరు తెన్నలను మరచి తనకు అధికారం కావాలని ఆశతో తనపై నియోజకవర్గంలో ఎవరు గెలిచినా వారిపై తన అనుచరులతో కేసులు వేయించడం ఆయనకు పరిపాటిగా మారింది. నియోజకవర్గంలోని ప్రజల మనసును చూరగొన వారి గుండెల్లో కొలువైన నాయకులపై ఈ ఊకదంపుడు కేసులు వేయించడం పట్ల పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# వార్తా ప్రభ హైదరాబాద్

## గొప్ప మనసుతో ఆర్థిక సహాయం!!

● మృత కుటుంబానికి 5వేల రూపాయలు అందజేత ● సేవలోనే ఆత్మసంతృప్తి ● కాంగ్రెస్ నేత నెలకంటి రాము



**పెద్దపల్లి/ గోదావరిఖని: మార్చి 11 (వార్తాప్రభ ప్రతినిధి)**గొప్ప మనసుతో ఆర్థిక సహాయం చేశారు కాంగ్రెస్ నేత నెలకంటి రాము. ఈ మేరకు మంగళవారం గోదావరిఖనిలోని అంబేద్కర్ నగర్ ప్రాంతానికి చెందిన యతిరాజ్ శేఖర్ ఇటీవల మరణించిన నేపథ్యంలో ఆ యొక్క మృత కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సహాయం నేరుగా అందజేశారు రాము. అనంతరం రాము మీడియాతో మాట్లాడుతూ...... రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, సతీమణి మనాలి ఠాకూర్ చేస్తున్న సేవా కార్యక్రమాల స్ఫూర్తిగా తాను సైతం సేవా ప్రపంచంలో తోడ్పాటు అందిస్తున్నానని తెలిపారు. ఇకముందు కూడా ఆ యొక్క కుటుంబానికి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు లింగయ్య, ప్రకాష్, హారతి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి- కొలుకుల శశికళ జగన్





**జగద్గిరిగుట్ట మార్చి 11 (వార్తాప్రభ) :** మహిళలు రాజకీయంగా ఆర్థికంగా అన్ని రంగాల్లో రాణించాలని జగద్గిరిగుట్ట డివిజన్ బి ఆర్ ఎస్ మహిళా నాయకురాలు కొలుకుల శశికళ జగన్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి లోని కన్యక పరమేశ్వరి ఆలయంలోని కమిటీ హాల్ లో స్థానిక మహిళలతో కలిసి కేక్ కట్ చేసి మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను ఆమె సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాలలో పోటీపడాలన్నారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో మహిళలకు అన్ని రంగాలలో రాణించడానికి ప్రోత్సహించింది అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీసీ. ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీదేవి. ఇండియన్ బ్యాంక్ మేనేజర్. ఉషారాణి. టీజీ బ్యాంక్. రఘునందన్ రావు. హరిప్రియ. కిషోర్ కుమార్. డివిజన్. మహిళ నాయకురాలు. వరమ్మ. సువర్ణ. కొలుకుల జ్యోతి. శాంతి హైమావతి. పద్మ. మంజుల. శోభారాణి. ఝాన్సీ. మాధవి. సుజాత.లక్ష్మి. జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి పేదలకు గొప్పవరం

**- నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి**



**నిజాంపేట్ మార్చి 11 (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాచుపల్లి 2వ డివిజన్ ప్రగతి నగర్ ప్రెసిడెంట్ సురగణి వీరబాబు పెద్దనాన్న వీరాస్వామి గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతు నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుటకు ఆర్థిక స్థోమత లేదు అని తెలుసుకున్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితుడికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 4,00,000/- ల సీఎం సహాయనిధి - ఎల్వోసీ ని మంజూరి చేయించారు. రూ 4,00,000/- (నాలుగు లక్షల రూపాయలు ) సీఎంఆర్ఎఫ్ - ఎల్ ఓ సి మంజూరి పత్రాలను వీరబాబు కి మంగళవారం కొలన్ హన్మంత్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ 1వ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజి రెడ్డి, 126 డివిజన్ అధ్యక్షులు గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పద్మ రావు , ప్రశాంత్ రెడ్డి, షఫీ, సురేందర్, శివ కుమార్, మల్లేష్, మొహ్మద్ పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## వైసీపీలోకి వర్మ...ఇందులో లాజిక్ ఉందా ?

పిఠాపురం వర్మ ఇపుడు ఏపీలో టాక్ ఆఫ్ ది పొలిటిక్స్ అయిపోయారు. ఆయనలా ఇంతగా ఒక నియోజకవర్గం స్థాయి నేత రాష్ట్ర రాజకీయాలలో నలిగింది లేదు. దానికి కారణం పిఠాపురం అంటే వచ్చే పొలిటికల్ వైబ్రేషన్స్ వేరేగా ఉంటాయి. అక్కడ ఎమ్మెల్యేగా ఉన్నది ఎవరో కాదు జనసేనాని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్. అందువల్ల పిఠాపురం నుంచి ఏ చిన్న మ్యాటర్ వచ్చినా అది బ్లాస్ట్ అవుతుంది. ఇదిలా ఉంటే 2014 నుంచి 2019 దాకా పిఠాపురానికి ఎమ్మెల్యేగా చేసిన ఎస్వీఎస్ఎన్ వర్మకు టీడీపీతో సుదీర్ఘ అనుబంధం ఉంది. ఆయనకు 2009లో టీడీపీ నుంచి తొలిసారి పోటీ చేస్తే 45,587 ఓట్లు దక్కాయి. ఇక 2014లో పార్టీ టికెట్ ఇవ్వకపోతే ఇండిపెండెంట్ గా బరిలోకి దిగి 47,080 మెజారిటీని సాధించారు. 2019లో అయితే టీడీపీ టికెట్ మీద పోటీ చేసి ఓడినా 68,467 ఓట్లు తెచ్చుకున్నారు. అలా వర్మ సొంత ఇమేజ్ ప్లస్ టీడీపీ క్యాడర్ అన్నీ కలసి ఆయనకు మంచి వోటింగ్ ని తెస్తూ ఉన్నాయి. అయితే 2024 లో మాత్రం వర్మ పోటీ చేయలేకపోయారు. వరుసగా మూడు ఎన్నికల్లో పోటీ చేసిన వర్మకు కూటమి పొత్తు జనసేన రూపంలో బ్రేక్ పడింది. ఇక చట్ట సభలోకి వర్మ ప్రవేశించి పదేళ్ళు అవుతోంది. దాంతో ఆయన ఎమ్మెల్సీగా అయినా సభలోకి రావాలని అనుకున్నారు. పైగా ఆయనకు మంత్రి పదవి కూడా ఆఫర్ ఉందని ప్రచారం సాగింది. తీరా చూస్తే తాజాగా ఎమ్మెల్సీ సీట్ల ఎంపికలో వర్మకు మొండి చేయి దక్కింది. దానికి కారణం టీడీపీ పెద్దలకు వర్మ మీద అభిమానం ఉన్నా లోకల్ గా జనసేన నేతలతో వర్మకు గ్యాప్ ఉండంతో ఆయనకు సీటు ఇస్తే ఆ ఇంపాక్ట్ కూటమి బంధాల మీద పడుతుందని ఆలోచించి ఆగారని కూడా అంటున్నారు. వర్మకు చూస్తే తనకు ప్రజా బలం ఉందని ధీమా ఉంది. అదే సమయంలో ఆయన అక్కడ కీలక నేతగా ఉన్నారని జనసేనకు ఉంది. జనసేనది సీటు అయినా హవా తమదే అన్నది వర్మ అనుచరుల మాటగా ఉంది. దీంతోనే విభేదాలు వస్తున్నాయి. ఇవి ముదరకుండా ఉండాలనే వర్మకు చాన్స్ ఇవ్వలేదని కూడా అంటున్నారు. ఈ నేపథ్యం నుంచి చూసినపుడు రానున్న 2027 ఎమ్మెల్సీ ఖాళీలను భర్తీ చేసినపుడు ఇదే రకమైన పరిస్థితి రావచ్చు అని అంటున్నారు. ఎందుకంటే అప్పటికి ఇంకా ముదిరేవే తప్ప కుదిరేవి కావు ఈ గ్యాప్స్ అని అంటున్నారు. దాంతో పాటు పిఠాపురం జనసేన అడ్డా అని నాదెండ్ల మనోహర్ ప్రకటించేశాక వర్మ 2029 ఆశలు కూడా అవిరి అనే అంటున్నారు. పవన్ కి ఈ సీటు సొంతంగా మారిందని ఆయనే పొత్తులలో భాగంగా పోటీ చేస్తారు అన్నది నిర్ధారణ అయినపుడు ఎగువసభకు అయినా పంపకుండా అసెంబ్లీకి చోటు దక్కకుండా ఉంటే వర్మ అండ్ కో కి ఉక్కబోత తప్ప మరేమి ఉందని అంటున్నారు. ప్రస్తుతానికి వర్మ చంద్రబాబు లోకేష్ అని కీర్తిస్తున్నా తన రాజకీయానికి బ్రేకులు పడుతూంటే చూస్తూ ఊరుకుంటారా అన్నది కూడా చర్చగా ఉంది. మరి ఎమ్మెల్సీ లేకపోతే ఎమ్మెల్యేగా అయినా చట్టసభలో కనిపించాలి. వర్మకు ఎమ్మెల్సీ దక్కకపోతే ఎమ్మెల్యేగా పోటీ అంటే కూటమి నుంచి చాన్స్ ఉండదు. అపుడు ప్రతిపక్షంలో వైసీపీయే మార్గం అని అంటున్నారు. బెస్ట్ ఆప్షన్ గా వైసీపీయే ఉందని అంటున్నారు. దీంతోనే ఇపుడు సోషల్ మీడియాలో ఇదే అంశం మీద పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ం వర్మకు టచ్ లోకి వైసీపీ నేతలు వచ్చారని ఆయన తొందరలోనే వైసీపీలోకి వెళ్తారని ఈ ప్రచారంగా ఉంది. అయితే వర్మ చాలా పరిణతి ఉన్న నాయకుడని అంటున్నారు. ఆయన ఈ సమయంలో వైసీపీలోకి ఎందుకు వెళ్తారని అంటున్నారు. వెళ్ళి బావుకునేది ఏముందని అంటున్నారు. ఏపీలో కూటమి సర్కార్ చేతిలో నాలుగేళ్ళకు పైగా అధికారం ఉంది. వర్మకు ఎమ్మెల్సీ పదవి లేదు కానీ టీడీపీ నియోజకవర్గం ఇంచార్జిగా ఉన్నారు. అధికార పార్టీలో ఉంటూ హవా చాటుకోవడానికి ఈ పదవి చాలు. అంతే కాదు ఫ్యూచర్ లో ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఉంది. దాంతో వర్మ తొందర పడరనే అంటున్నారు. ఇక 2027లో కూడా ఎమ్మెల్సీ పదవి ఇవ్వకపోతే అపుడు ఏమైనా వర్మలో మార్పు రావచ్చు ఆయన ఆలోచనలు మారవచ్చు అని అంటున్నారు. ఎందుకంటే అప్పటికి సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడతాయి కాబట్టి ఏదో కీలక నిర్ణయం తీసుకోవచ్చు అని అంటున్నారు. అందువల్ల ఈ ప్రచారంలో ఇపుడు లాజిక్ ఉందా అంటే లేదనే అంటున్నారు. అయితే రాజకీయాల్లో ఎపుడు ఏమి జరుగుతుందో తెలియదు కాబట్టి ఈ తరహా ప్రచారాలు వస్తూనే ఉంటాయని అంటున్నారు.

## నాలుగు గంటల్లో ముఖ్యమంత్రి సహాయనిధి నుండి.... రూ. 2.50 లక్షల రూపాయల చెక్కును అందించిన మంత్రి పార్థసారథి



**నూజివీడు: మార్చి 11 (వార్తాప్రభ)**ప్రాణాపాయ స్థితిలో ఉన్న 15 ఏళ్ల చిన్నారికి మెరుగైన చికిత్సకోసం బాధిత కుటుంబానికి రూ. 2.50 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధిని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అందజేశారు. ముసునూరు మండలం, గుళ్ళపూడి గ్రామానికి చెందిన నూర్ భాష, ఆయిసా రజియిల్లా (15) విజయవాడ హెల్ప్ హాస్పటల్ లో ప్రాణాపాయ స్థితిలో ఉండి చికిత్స పొందుతూ మెరుగైన వైద్యం కోసం మంత్రి గారిని అభ్యర్ధించగా విషయం తెలుసుకున్న మంత్రి పార్థసారథి వెంటనే సీఎం సహాయనిధి ద్వారా మంజూరు చేయించేందుకు సిఫార్సు చేశారు. కేవలం 4 గంటల్లో బాధితులకు మెరుగైన వైద్యం నిమిత్తం కుటుంబ సభ్యులకు సుమారు రూ2.50 లక్షల విలువైన చెక్కును స్వయంగా మంత్రి పార్థసారథి హాస్పిటల్ కి వెళ్లి చెక్కును అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూపేదవాడి పూర్తి ఆరోగ్య భద్రత కూటమి ప్రభుత్వానిదని మంత్రి పార్థసారధి అన్నారు.



# ప్రతి ఇంటికి అభివృద్ధి, ప్రతి జీవితానికి ప్రగతి

### జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలిపట్నం మార్చి 11 (వార్తాప్రభ ప్రతినిధి)**ప్రభుత్వ, దాతల, ప్రజల భాగస్వామ్యం( పి4)తో ప్రతి ఇంటికి అభివృద్ధి, ప్రతి జీవితానికి ప్రగతి చేకూరుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు మంగళవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ వారి చాంబర్లో స్వచ్ఛ ఆంధ్ర ఏ 2047 గోడపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర ఏ 2047 దిశగా ముందడుగు వేస్తుందని, సమాజంలో ఉన్న 20 శాతం అత్యంత నిరుపేదల అభ్యున్నతికి పి- 4 మోడల్ - ప్రభుత్వ, దాతల ,ప్రజల భాగస్వామ్యం ద్వారా టాప్ 10 శాతం తెలుగు ప్రవాసులు, అధిక సంపన్న వ్యక్తుల సహకారంతో పేదరికం లేని సమాజాన్ని సాధించడానికి సంకల్పించిందన్నారు. ఇందులో భాగంగా ప్రజల విలువైన అభిప్రాయాన్ని స్కాన్ ద్వారా గాని https://swarnandhra .ap.gov.in/P4 లింక్ ద్వారా గాని అందించడానికి ఈనెల 25వ తేదీ వరకు ప్రజల భాగస్వామ్యం సంప్రదింపు కాలపరిమితిగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రానున్న ఉగాది రోజున పి-4 కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, సిపిఓ గణేష్ కృష్ణ, సమాచార శాఖ ఉపసంచాలకులు యమ్ వెంకటేశ్వర ప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# నగరంలోని మ్యాన్ హోల్స్ అన్ని రోడ్ లెవెల్ లో ఉండాలి

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాలు





**విజయవాడ పశ్చిమ మార్చి 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నగరంలోని మ్యాన్ హోల్స్ అన్ని రోడ్ లెవెల్ లో ఉండాలి అన్నారు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర. మంగళవారం ఉదయం తన పర్యాటంలో భాగంగా కేదారేశ్వరపేట వాటర్ ట్యాంక్,, పూర్ణానంద పేట, బాప్తిష్ట పాలెం, ఖుద్దుస్ నగర్, పెజోని పేట ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఉన్న మాన్ హోల్స్ అన్ని అధికారులు పర్యటించి రోడ్ లెవెల్ లో ఉంచాలని, సైడ్ డ్రెయిన్లన్నీ ఎప్పటికప్పుడు డీసిల్టింగ్ చేసుకుంటూ నగరంలో ఉన్న డ్రైనలలో పూడికలు తీయాలని, కల్వర్ట్ మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. తదుపరి శ్రీ వెలగపూడి లక్ష్మణ దత్తు ప్రాథమిక పాఠశాల పర్యటించి అక్కడున్న వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాలలో పిల్లలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా విజయవాడ నగర పాలక సంస్థ వారు కల్పించే సౌకర్యాలని కల్పించాలని మరుగుదొడ్లు, నీటి సరఫరా, పరిశుభ్రత కచ్చితంగా ఉండేటట్టు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చూసుకుంటూ ఉండాలని అన్నారు. ప్రజలు దోమల బారిన పడకుండా ఉండేందుకు తరచుగా యం ఎల్ ఆయిల్ కాలువల్లో స్ప్రే చేసుకుంటూ, ప్రజలకు డ్రై డే గురించి అవగాహన కల్పిస్తూ, ఇంటి పరిసరాల్లో ఉన్న నీటిని, నిల్వ లేకుండా చూసుకోవాలని, కల్వర్ట్ వద్ద ఫకింగ్ చేసుకుంటూ నిరంతరం యాంటి లార్వా ఆపరేషన్లు నిర్వహిస్తుండాలని అధికారులను ఆదేశించారు. తదుపరి ధర్నా చౌక్ వద్ద గల అన్న క్యాంటీన్ ను పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్న క్యాంటీన్లో ప్రజలకు వచ్చే ఆహారంలో నాణ్యత నిరంతరం పరీక్షించాలని. నిర్ణీత టోకెన్లు ఇస్తున్నారా లేదా, మరుగుదొడ్లు, నేటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ కచ్చితంగా ఎప్పటికప్పుడు చూసుకుంటూ ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, ఇన్చార్జ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# 'గీత్'తో నైపుణ్యాభివృద్ధి





**విజయవాడ పశ్చిమ, మార్చి 11:(వార్తా ప్రభ ప్రతినిధి)**జీవన నైపుణ్యాలు, వృత్తి నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి, విద్యార్థులను అధునాతన ఉద్యోగాలకు సన్నద్ధులను చేసేందకు 'గ్రాడ్యుయేట్ ఎంప్లాయిబిలిటీ ఎన్ హాన్స్ మెంట్ ట్రైనింగ్' (గీత్) శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు లెర్నెట్ స్కిల్స్ లిమిటెడ్ సౌత్ రీజినల్ హెడ్ ఆర్. పురుషోత్తం అన్నారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్, సుజనా ఫౌండేషన్, లెర్నెట్ స్కిల్స్ లిమిటెడ్ సంస్థల సహకారంతో కె.బి.ఎన్. కళాశాలలో విద్యార్థులకు నైపుణ్య శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పురుషోత్తం మాట్లాడుతూ ఉపాధి నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి, చదువు పూర్తి కావటంతో నే విద్యార్థులను ఉద్యోగాలకు సన్నద్ధులను చేసేందుకు 'గీత్' ప్రోగ్రాం ప్రారంభించినట్లు చెప్పారు. కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి మాట్లాడుతూ 80 గంటల పాటు ప్రత్యేక విధానంలో శిక్షణ ఇచ్చేందుకు వివిధ రంగాల్లో నిపుణులు ఈ శిక్షణలో భాగస్వాములు అవుతున్నట్లు చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ పి. ఎల్. రమేశ్ మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వేగంగా మారుతున్న పరిణామాలను విద్యార్థులు తెలుసుకుని, వాటికి అనుకూలంగా నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. హిందూ హై స్కూల్స్ కమిటీ పరిపాలనాధికారి డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ నూతన సాంకేతిక విధానాలపై అవగాహన పెంచుకోవడం, భావ ప్రసార నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా మాత్రమే ప్రస్తుత ఉద్యోగ మార్కెట్లో పోటీ తట్టుకోగలగటం సాధ్యమవుతుందని విద్యార్థులకు సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు మాట్లాడుతూ అంకితభావం, కృషి ఉంటే తప్పనిసరిగా విజయం సాధించడం తేలిక అవుతుందన్నారు. సుజనా ఫౌండేషన్ ప్రతినిధి పైలా సురేష్ మాట్లాడుతూ, విజయవాడ వెస్ట్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి సహాయంతో ఈ కార్యక్రమం కేబీఎన్ కళాశాలకు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ, కెరీర్ అభివృద్ధి అవకాశాలను అందించడంలో సుజనా ఫౌండేషన్ సంపూర్ణంగా కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి పి. రవీంద్ర పాల్గొన్నారు.

# చేజర్ల రైతు సేవ కేంద్రంలో డిఆర్డిఏ పిడి సమావేశం

### ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి...ఉడత హజరత్తయ్య





**చేజర్ల మార్చి 11 (వార్తాప్రభ)** మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం డిఆర్డిఏ పిడి నెల్లూరు వారు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. మండలంలో 10 పీపీసీ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రైతులు ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకుంటే ప్రభుత్వ గిట్టుబాటు ధర రైతులు పొందవచ్చని అలాగే దళారులు ప్రభుత్వం ఇచ్చే ధర కంటే ఎక్కువ ఇస్తే తీసుకోండి కానీ తక్కువ ధరకు మాత్రం అమ్ముకోవద్దని ఆమె తెలిపారు. రైతులు ధాన్యాన్ని అమ్ముకునేటప్పుడు ప్రభుత్వం నిర్ణయించిన పద్ధతుల ప్రకారం పాటిస్తే రైతులు నష్టపోకుండా ఉంటారని సరైన గిట్టుబాటు ధర అందుతుందని ఆమె తెలిపారు. రైతులందరూ ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మార్వో బి.మురళి సాగునీటి సంఘం అధ్యక్షులు మరియు గొల్లపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు ఉడత హజరతయ్య మండల టిడిపి అద్యక్షులు రావి లక్ష్మి నరసారెడ్డి బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు కుంకు బాలయ్య నాయుడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయ లలిత ఏపిఎం సృజన పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ముగిసిన రాజ్యపురస్కార్ స్కౌట్ శిబిరం





**విజయవాడ పశ్చిమ మార్చి 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**స్థానిక పటమట కెబిసి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాలో ని స్కౌటు విద్యార్థులకు రాష్ట్రస్థాయి రాజ్యపురస్కార్ పరీక్షా శిబిరం ఐదురోజులపాటు నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రవేశ్, ప్రథమసోపాన్, ద్వితియసోపాన్, తృతియసోపాన్, రాజ్యపురస్కార్ పరీక్షలు నిర్వహించారు. డి ఎ వి పబ్లిక్ స్కూల్ ఇబ్రహీంపట్నం, జిల్లాపరిషత్ హైస్కూల్ గుంటుపల్లి, నేతాజీ హైస్కూల్ భవానిపురం పాఠశాల స్కౌట్లు పాల్గొన్నారు. కాగా ఈ శిబిరాన్ని మంగళవారం జిల్లా డి ఇ ఓ యు వి సుబ్బారావు సందర్శించి స్కౌట్లు ప్రదర్శించిన ప్రథమ చికిత్స, పయనీరింగ్, మ్యాపింగ్, ఎస్టిమేషన్ నైపుణ్యాలను ప్రశంసించారు. దారం ప్రసాద్ నాయకత్వం వహించిన ఈ క్యాంపుకు కెపి ఆర్ బి శర్మ, డి యోగేశ్వరరావు, యల్ రత్నకుమార్ సహాయకులు గా వ్యవహరించారు. జిల్లా సెక్రటరీ పి మురళి శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ను పాఠశాల, విశ్వభారతి స్కౌటు గైడులు సందర్శించారు.

## భవన నిర్మాణ సంబంధిత జీవోలపై సిబ్బందికి అవగాహన కార్యక్రమం





**విజయవాడ పశ్చిమ మార్చి 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**భవన నిర్మాణ సంబంధిత జీవోలపై సిబ్బందికి మంగళవారం సాయంత్రం తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో అవగాహన కార్యక్రమం కల్పించారు విజయవాడ నగర పాలక సంస్థ సిటీ ప్లానర్ చీఫ్ సిటీ ప్లానర్ జి వి జి ఎస్ వి ప్రసాద్. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణాల సంబంధించిన జీవోలపై, సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడమే కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు, బిల్డర్లు, వ్యాపారవేత్తలకు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో భాగంగా కల్పించిన సౌకర్యాలు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండానే ఆన్లైన్ వెబ్సైట్ ద్వారా ప్లాన్లను దరఖాస్తు చేసుకునే ప్రక్రియ వంటి విషయాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ రాజమహేంద్రవరం శ్రీనివాసులు, డిప్యూటీ సిటీ ప్లానర్ సుభాష్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రాంబాబు, మోహన్ బాబు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ గిరి, లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ ఇంజనీర్లు ఆర్కిటెక్టు టౌన్ ప్లానింగ్ సిబ్బంది.

## వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యం - సిడిపిఓ లక్ష్మీ భార్గవి



**జగ్గయ్యపేట మార్చి 11 (వార్తప్రభ)**ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్య మీద మనసు లగ్నం చేయగలుగుతారని సిడిపిఓ లక్ష్మి భార్గవి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక స్వచ్ఛంద సంస్థ కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పునర్వినియోగ శానిటరీ నాప్కిన్స్ పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. కిషోర దశలో బాలికలు తీసుకోవలసిన పలు జాగ్రత్తలు విశదీకరించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన సహకార భారతి జాతీయ కార్యవర్గ సభ్యురాలు జానకి దేవి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలు అందిస్తున్న సేవలను వినియోగించుకోనీ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు, ప్రత్యేక ఆహ్వానితులు సహకార భారతి రాష్ట్ర మహిళా ప్రముఖ్ నళని మాట్లాడుతూ ఆకాశమే హద్దుగా ఆడపిల్లలు ఎదగాలని సూచించారు. కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల ప్రాజెక్ట్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. నో ఫుడ్ వేస్ట్ , ప్రాజెక్ట్ బాల సంయుక్త ఆధ్వర్యంలో భవిష్యత్తులో కూడా కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు తెలిపారు. నేడు సుమారు లక్ష రూపాయలు విలువైన న్యాప్కిన్సుని పంపిణీ చేయడం జరిగిందన్నారు .రీ యూజబుల్ (పునర్ వినియోగించే ) శానిటరీ ప్యాడ్స్ ను 300 మంది బాలికలకు అందజేశామన్నారు. ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి మాట్లాడుతూ సహకారాన్ని అందించిన కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. స్త్రీ జీవితంలో రుతుక్రమం సాధారణమైన ప్రక్రియ అని, ఆ సమయంలో తీసుకోవలసిన పలు జాగ్రత్తలు విశదీకరించారు. కాగా ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శారద, రాయపూడి వెంకటేశ్వరరావు ట్రస్ట్ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, ట్రస్ట్ మేనేజర్ పారాల రాము, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ప్రాణాలను ఆరోగ్యాలను హరిస్తున్న థర్మల్ విద్యుత్ కేంద్రం కాలుష్యం

**● బూడిదతో కోట్లు గడిస్తున్న నేతలు, పాలకులు, ఉన్నతాధికారులు ● భవిష్యత్తులో అమరావతికి ఈ కాలుష్యపు సెగ ● నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు పాటించాలి ● సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు**



పర్యటనలో సిపిఎం జిల్లా, స్థానిక నేతలు ఎన్సిహెచ్.శ్రీనివాస్, మహేష్, విటల్, సుధాకర్ తదితర నేతలు పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నం మార్చి 11(వార్తా ప్రభ ప్రతినిధి):** ఇబ్రహీంపట్నంలోని బూడిద చెరువు తదితర ప్రాంతాల్లో బాబురావు, జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ తదితర నేతలతో కలిసి పర్యటించారు స్థానిక ప్రజలతో మాట్లాడారు.ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ రాష్ట్రం మొత్తానికి విద్యుత్ ను అందిస్తున్న ఇబ్రహీంపట్నం లోని నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ కాలుష్యంతో ఇబ్రహీంపట్నం, కొండపల్లి పరిసర ప్రాంతాల గ్రామాల్లోని లక్ష మంది పైగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు కొందరు అనారోగ్యంతో మృత్యువాత పడ్డారు. ప్రజారోగ్యం క్రమంగా క్షీణిస్తోంది, శ్వాస కోస వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. మరికొందరు కిడ్నీ తదితర వ్యాధులతో అవస్థ పడుతున్నారు. ప్లాంట్ నుండి వస్తున్న పొగ, దుమ్ము, ధూళి.. బొగ్గు వలన వస్తున్న కాలుష్యం, తడి, పొడి బూడిదతో విడుదలవుతున్న కాలుష్యంతో పరిసర ప్రాంతాలు ప్రజలు తల్లడిల్లుతున్నారుఒకవైపు నీటి కాలుష్యం, మరోవైపు గాలి కాలుష్యంతో ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి ప్లాంట్ లోపల ప్రమాదాలు, బూడిద అక్రమ రవాణా వాహనాలతో ప్రమాదాలతో పలువురు మృత్యువాత పడ్డారు.మరోవైపు బూడిద అక్రమ తరలింపు, అక్రమ కాంట్రాక్టులు, ఇతర అవినీతితో పాలక పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు, కొందరు ఉన్నతాధికారులు బడా కంపెనీలు కోట్లు సంపాదిస్తున్నారు.కాలుష్యం నివారణకు నిధులు కేటాయిస్తామని ప్రకటనలే తప్ప ఆచరణ లేదు.ప్రభుత్వం యాజమాన్యం స్పందించకపోతే ఏప్రిల్ నెలలో స్థానిక ప్రజలందరినీ కలుపుకొని ఆందోళన చేపడుతాం, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు.ఈ

## ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతమైన వెనుకబడ్డ కనిగిరి ప్రాంతానికి నిధులు కేటాయించండి

**సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి**




**కనిగిరి మార్చి 11 వార్తా ప్రభ ప్రతినిధి** ప్రకాశం జిల్లాలో పశ్చిమ ప్రాంతమైన కనిగిరి ప్రాంతానికి నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబుకు మంగళవారం కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి విన్నవించారు. నియోజకవర్గం లో ఫ్లోరోసిస్ సమస్యకు పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు హాస్టల్ సదుపాయాలు మెరుగుపరచాలని, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి నిధులు కేటాయించాలని, డయాలసిస్ సెంటర్ ఆధునీకరణకు చర్యలు తీసుకొని నిధులు కేటాయించాలని, ఎం జె పి బి సి వెల్ఫేర్ హాస్టల్ కు శాశ్వత భవనం నిర్మాణం చేపట్టేందుకు నిధులు కేటాయించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధులు కేటాయింపులకు అంగీకారం తెలిపారని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో కనిగిరి అభివృద్ధిలో మరో ముందడుగు పడనుంది.

## అంగన్వాడిలను రోడ్డున పడవేసిన జగన్మోహన్ రెడ్డి.

**ఆ పార్టీ నాయకులు రెచ్చగొట్టే విధంగా వివరించడం సరికాదు:**

**ఆ అంగన్వాడీ నాయకురాలు కొమ్మాని విజయ**



**నూజివీడు: మార్చి 11 (వార్తాప్రభ ప్రతినిధి)**రాష్ట్రంలో అంగన్వాడీలను రోడ్డున పడవేసిన ఘనత మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డికి దక్కుతుందని ఏలూరు పార్లమెంట్ అంగన్వాడి డ్వాక్రా మహిళ అధ్యక్షురాలు, 25 వ వార్డు కౌన్సిలర్ కొమ్మని విజయ విమర్శించారు. నూజివీడు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నూజివీడు అంగన్వాడి డ్వాక్రా మహిళ కార్యదర్శి సయ్యద్ నజీమా మున్నీసా, 19వ వార్డ్ ప్రెసిడెంట్ జాలాది సుధారాణి, తెలుగునాడు అంగన్వాడి రాష్ట్ర కార్య నిర్వహణ అధ్యక్షురాలు కొడాలి హేమలత, ఏలూరు జిల్లా ఉపాధ్యక్షురాలు రుద్రపాటి లక్ష్మీకాంత్ తో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు అత్యధికంగా వేధింపులకు గురైన సంఘటనలు ఏమైనా జరిగాయంటే అది వైసిపి పాలనలోనే అని విమర్శించారు. అంగన్వాడీలకు జగన్మోహన్ రెడ్డి చేసింది ఏమీ లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంగన్వాడీలకు ఉద్యోగ భరోసా కల్పించడంతోపాటు జీతాలను పెంచిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వైసిపి పాలనలో అంగన్వాడీల నోరును నొక్కేశారని, వారిని ఇలాంటి వేధింపులకు గురి చేశారు రాష్ట్రవ్యాప్తంగా అందరికీ తెలిసిందే అన్నారు. తెలుగు నాడు అంగన్వాడీ రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షురాలు కొడాలి హేమలత మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎలాంటి ఆదరణ లేని అంగన్వాడీలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కానీ వైసీపీ నాయకుల మాటలు విని అంగన్వాడీలు నిరసనలు చేయడం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం మంచిది కాదని సూచించారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలం

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు**




**ఇబ్రహీంపట్నం, మార్చి 11 (వార్తా ప్రభ ప్రతినిధి):**ప్రజా సమస్యల పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు అన్నారు. ఇబ్రహీంపట్నం లో మంగళవారం సిపిఎం పార్టీ ఎన్టీఆర్ జిల్లా విస్తృత సమావేశాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సమస్యలు పరిష్కారం లో పూర్తిగా విఫలం అవుతుంది అన్నారు, మార్చి 8 నుండి 17వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సమస్యలను అధ్యయనం చేసేందుకు ప్రజా చైతన్య యాత్రల్ని సిపిఎం నిర్వహిస్తుదన్నారు ,ప్రజా సమస్యలపై మార్చి 22 నుంచి 28వ తేదీ వరకు మండలాల్లో పట్టణాల్లో ఆందోళన చేపడతామని హెచ్చరించారు, రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బారాలను పెద్ద ఎత్తున ప్రజలపై వేసిందన్నారు ,స్మార్ట్ మీటర్లుపెట్టి ప్రజల జేబులు కుల్లగోడుతుందని చెప్పారు. కిడ్నీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేదన్నారు, డాక్టర్ ఎన్టిపిఎస్ విడుదల చేస్తున్న బూడిద వల్ల ప్రజల తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు , బూడిద పై రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు సంవత్సరానికి 300 కోట్లపైగా వ్యాపారం చేస్తున్నారని, ప్రజల ప్రాణాలను పట్టించుకోవడంలేదని వాపోయారు,బూడిద కాలుష్యం నివారణకు చర్యలు తీసుకోవాలని, ఇది ఇబ్రహీంపట్నం మండల ప్రజలకు సంబంధించినది కాదని ,కాలుష్యం అమరావతిని తాకుతుందని అన్నారు, రాజధాని కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్నా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కాలుష్యం కోరల్లో ఉంది 100 కోట్లు నిధులు వెచ్చిస్తే తప్ప కాలుష్య నివారణ సాధ్యపడదని అన్నారు, ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోకుంటే ప్రజలను సమీకరించి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి సభ్యులు, ఎన్ సి హెచ్ శ్రీనివాస్, పీవీ ఆంజనేయులు ,కోట కళ్యాణ్, ఎం నాగేంద్రప్రసాద్, ఇబ్రహీంపట్నం సిపిఎం మండల కార్యదర్శి ఎం మహేష్, సిపిఎం సీనియర్ నాయకులు ఆలేటి విటల్ రావు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## కళ్యాణమూర్తుల గ్రామోత్సవం..



**కూచిపూడి: అవనిగడ్డ: మార్చి 11(వార్తాప్రభ ప్రతినిధి)**కూచిపూడి నాట్యాచార్యుల ఇలవేల్పు శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి 262వ వార్షిక కళ్యాణ ఉత్సవాలలో భాగంగా ఉత్సవం మూర్తులను పెళ్లి కుమారుని పెళ్లి కుమార్తెను చేసి అగ్రహారంలో గ్రామోత్సవం నిర్వహించారు .బుధవారం స్వామివార్ల కళ్యాణ మహోత్సవం గురువారం రథోత్సవం శుక్రవారం వసంతోత్సవం శనివారం పుష్పయాగోత్సవం కార్యక్రమాలు జరుగుతాయని దేవాలయ ధర్మకర్తల మండలి ఒకప్రకటనలో తెలియజేశారు

# చంద్రాల లో సామూహిక ఎలుకల నిర్మూలన రైతులకు అవగాహన




**మైలవరం: మార్చి 11 (వార్తాప్రభ ప్రతినిధి)**పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని చంద్రాల గ్రామంలో సామూహిక ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది.ఈ కార్యక్రమానికి పిడిఎపిఎంఐపి అండ్ పిఎం సుభాని,జిల్లా ఉద్యాన అధికారి పి. బాలాజీ కుమార్, మైలవరం సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరావు, ఏడిఏ (డి ఆర్ సి) పి.మోనీష హాజరయ్యారు.ఈ సందర్భంగా మోనీష మాట్లాడుతూ ఎలుకలు వరి పంటను మరియు మిగిలిన పంటలను అన్ని దశలలో నష్ట పరుస్తాయని,దీని నివారణకు సామూహికంగా రైతులు అందరూ నివారించా లని అందుకు గాను ప్రతి ఎలుక బొరియలో 10 గ్రాముల ఎర మందును పొట్లాలు కట్టి వేయాలని తెలిపారు.విషపు ఎర తయారికి 100 గ్రాములకు 2గ్రాముల బ్రోమోడయోలోన్ మందు, 96 గ్రాముల నూకలు, 2 గ్రాముల నూనె కలిపి తయారుచేసుకోవాలని సూచించారు.ఈ బ్రోమోడయోలోన్ మందును వ్యవసాయశాఖ 100 శాతం రాయితిపై సరఫరా చేయటం జరుగుతుందని తెలిపారు.జిల్లా ఉద్యాన అధికారి పి. బాలాజీ కుమార్ మాట్లాడుతూ మామిడిలో తామరపురుగు నివారణకు ప్రతి పురుగుమందులో వేపనూనె కలిపి పిచికార్ చెయ్యాలని, ఎండుకొమ్మలు, గొడుగుకొమ్మలు కత్తిరించటం వలన గాలి వెలుతురు తగులుతుందని తెలిపారు.పిడిఎపిఎంఐపి అండ్ పిఎం సుభాని మాట్లాడుతూ రైతులకు డ్రిప్ మరియు స్ప్రింక్లర్ ఇరిగేషన్ పద్దతులు వివరించి రాయితీ కావలసిన రైతులు రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు.అనంతరం ఎలుకల విషపు ఎర తయారి విధానాన్ని చూపించి మందు పంపిణీ చేశారు.వరి పొలంలోని ఎలుక బొరియలలో మందు పొట్లాలు పెట్టించారు.తదుపరి మామిడి పంటను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.సంధ్యారాణి,మాజీ ఎంపిపి జొన్నలగడ్డ గంగాధరరావు,ఏ ఈ ఓ ఎం. నాగరాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేత



**జి.కొండూరు:మార్చి 11 (వార్తాప్రభ ప్రతినిధి)**స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆదేశాలతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక చెక్కులను తెదేపా మండల అధ్యక్ష, కార్యదర్శులు, పజ్జూరు రవికుమార్, లంక రామకృష్ణ వరప్రసాద్ లు ఆ పార్టీ నాయకులతో కలసి మంగళవారం అందజేశారు .మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల అనారోగ్యానికి గురై వైద్య చికిత్సలు చేయించుకున్నారు. వారి వైద్య చికిత్స కు సంబంధించి ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ఆర్థిక సహాయం మంజూరు చేయించారు.రూ.9,23,787 లు ఆర్థిక సాయం చెక్కుల రూపంలో మంజూరు కాగా టీడీపీ నాయకులు ఆ చెక్కులను మండలంలోని ఆ గ్రామాలకు వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు.చెక్కులతో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పంపిన లేఖను కూడా వారికి అందజేశారు.ఈ కార్యక్రమం లో గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, మన్నె కోటి బాబు, లక్ష్మణరావు, పశ్చి గోళ్ళ బాలకృష్ణ , వరి కూ టి రాము ,సుఖవాసిశ్రీహరి, సందీపాము జయలక్ష్మి,నూతక్కి సునీల్ ,సంపత్, గ్యార నాగరాజు ఆయా గ్రామాల,ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు పోషణ్ భీ-పఢాయి బీ శిక్షణ తరగతులు



**చేజర్ల మార్చి 11 (వార్తాప్రభ)** మండలంలోని ఆదూరుపల్లి జడ్పీహెచ్ఎస్ నందు అంగన్వాడీ కార్యకర్తలకు ఆత్మకూరు ప్రాజెక్టు సిడిపిఓ సునీలత ఆదేశాల మేరకు మంగళవారం పోషణ్ బీ- పడాయి బీ కార్యక్రమాన్ని చేజర్ల ఐసిడిఎస్ సెక్టార్ సూపర్వైజర్లు సిహెచ్ సురేఖ రమాదేవిలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్పీహెచ్ఎస్ స్కూల్ హెడ్మాస్టర్ జి.వి రమేష్ బాబు హాజరైనారు.ఈ శిక్షణ కార్యక్రమం మూడు రోజులు జరుగుతుందని అంగన్వాడీ కార్యకర్తలకు తెలిపారు.పోషన్ బీ పడాయి బీ కార్యక్రమాన్ని 2023 మే 10న కేంద్ర మంత్రి స్మృతి జుబేర్ ఇరానీ ప్రారంభించారు.3 నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలకు పోషణ స్థాయిని పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నామన్నారు.ఇందులో నవచేతన-ఆధార్ షీలా అనే కార్యక్రమాలలో భాగంగా జీరో నుండి 3 సంవత్సరాల పిల్లల తల్లులకు అంగన్వాడీ కార్యకర్తలు గృహ సందర్శనల ద్వారా పోషణ స్థాయి గురించి అవగాహన కల్పించాలని అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందజేస్తున్న బాలామృతం మీద తల్లులకు అవగాహన కల్పించి వారికి రోజు అందించే 100 గ్రాములు ఏ సమయంలో ఎంత మోతాదులో ఏ విధంగా తయారు చేసి అందించాలో తెలియజేశారు.ఈ వయసు చిన్నారులలో 80 శాతం మెదడు అభివృద్ధి చెందుతుందని ఆదార్ షీలా కార్యక్రమాల ద్వారా 3 నుంచి 6 సంవత్సరాల చిన్నారులకు పోషణస్థాయి ప్రీస్కూల్ తదితరాంశాల గురించి అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్నామని అలాగే ఆటపాటల ద్వారా చిన్నారులకు శారీరక అభివృద్ధి మేధావివృద్ధి సామాజిక అభివృద్ధి సృజనాత్మకతలకు సంబంధించిన ఐదు అంశాలను గురించి శిక్షణ తరగతులు నిర్వహించి అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నట్లు సూపర్వైజర్లు తెలిపారు.



# యూత్ పార్లమెంట్ రిజిస్ట్రేషన్ తేది ఈ నెల 16 వరకు పొడిగింపు

***-టి జె పి యస్ కళాశాల లో జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ పోటీలు***



**గుంటూరు, మార్చి 11 (వార్తాప్రభ ప్రతినిధి)**కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ వారి ఆదేశాల మేరకు జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ పోటీలను టి జె పి యస్ కళాశాల లో నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ మరియు యూత్ పార్లమెంట్ చైర్ పర్సన్ డాక్టర్ యస్ అనితా దేవి పేర్కొన్నారు.భారతదేశ అభివృద్ధి లో యువత బాగస్వామ్యం కావాలనే ఆలోచనతో,యువత మేధాశక్తి ని ఉపయోగించి ప్రపంచం లో కెల్లా మన దేశాన్ని ప్రధమ స్థానంలో ఉండే విధంగా చేయాలని, 2047 విజన్ భారత్ లక్ష్యం గా ఈ యూత్ పార్లమెంట్ పోటీలు నిర్వహణ జరగడం లో ప్రధాన ఉద్దేశ్యం అని పేర్కొన్నారు.జిల్లా స్థాయి నోడల్ %ఒ% జాతీయ సేవా పథకం జిల్లా కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జె వి సుధీర్ కుమార్ గారు మాట్లాడుతూ ఈ నెల 16 వ తేది వరకు ఒక నిమిషం వీడియో అప్లోడ్ చేయడానికి డేట్ పొడిగించడం జరిగిందని,గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణా, యన్ టి ఆర్ జిల్లా ల నుండి 18 సంవత్సరాల నుండి 25 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఎవరైనా ఈ యూత్ పార్లమెంట్ పోటీలలో పాల్గొనవచ్చని, ముందుగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మై భారత్ పోర్టల్ లో రిజిస్ట్రేషన్ చేసుకొని తరువాత ఒక్క నిమిషం నిడివి కలిగిన "వాట్ డస్ వికసిత్ భారత్ మీన్ టూ యూ"అనే అంశం పైన వీడియో చేసి మార్చ్ 16 వ తేది అర్ధరాత్రి 11-59 సమయం లో పు మై భారత్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని తెలియచేశారు. వీళ్లందరిని స్క్రీనింగ్ చేసి జిల్లా స్థాయిలో ఎంపిక జరుగుతుందని,తరువాత ఈ ఐదు జిల్లాల నుండి ఎంపికైన వాళ్ళకి జిల్లా స్థాయిలో టి జె పి యస్ కళాశాల, గుంటూరు లో 150 మంది విద్యార్థులకు పోటీ ఉంటుందని పేర్కొన్నారు.జిల్లా స్థాయిలో "వన్ నేషన్, వన్ ఎలక్షన్ :పేవింగ్ ది వే ఫర్ వికసిత్ భారత్ "అనే అంశం పై 3 నిముషాలు మాట్లాడాలని యువత ఈ గొప్ప అవకాశాన్ని యువత అందరూ తప్పనిసరిగా వినియోగించుకుని మన దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలని పేర్కొన్నారు.యూనివర్సిటీ ప్రొఫెసర్లు, వివిధ కళాశాల ల అధ్యాపకులు,ఐదు(గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణ, యన్టీఆర్ )జిల్లాల యన్ యస్ యస్ అధికారులు,యూత్ నాయకులు,నెహ్రూ యువ కేంద్రం అధికారులు, ఇతర అధ్యాపకులు, సామాజిక కార్య కర్తలు ఈ పోటీలు గురించి యువత కు అవగాహన కలిగించి ఎక్కువ సంఖ్యలో యువత పాల్గొనేలా చూడాలని చెప్పారు. సందేహల కోసం డాక్టర్ జె వి సుధీర్ కుమార్( గుంటూరు జిల్లా జాతీయ సేవా పథకం కార్యక్రమం నిర్వహణ మరియు యూత్ పార్లమెంట్ నోడల్ అధికారి )9849854221,కిరణ్మయి దేవిరెడ్డి 9177753393 ( గుంటూరు నెహ్రూ యువ కేంద్రం యూత్ అధికారి ), ఆర్ జయ శైలజ యన్ యస్ యస్ అధికారి 9494112860,గార్లను సంప్రదించాలని తెలియచేశారు.

## కిడ్స్ కాన్వెంట్స్ హై స్కూల్ లో ఉచిత కంటి వైద్య శిబిరం

**వేములవాడ, మార్చి 11 (వార్తాప్రభ ప్రతినిధి):** వేములవాడ: కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్లో మంగళవారం శ్రీ వర్షహాస్పిటల్ వారి ఆధ్వర్యంలోఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు ఈ కంటి వైద్య శిబిరంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు

## విశ్రాంత అదనపు ఎస్పీ

**పృథ్వీనారాయణకు ఘన నివాళులు**



**విజయవాడ, మార్చి 11 (వార్తాప్రభ ప్రతినిధి):** అమెరికాలో ఈ నెల 3వ తేదీన కన్నుమూసిన విశ్రాంత అదనపు ఎస్పీ బి.హెచ్.పృథ్వీనారాయణ భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు మంగళవారం తెల్లవారుజామున విజయవాడ తీసుకొచ్చారు. బంధు మిత్రుల సందర్శనార్థం భౌతికకాయాన్ని బందరు రోడ్డులోని 'లీలా గ్రాండ్' హోటల్ వద్ద వుంచారు. ఆయన సన్నిహితులు, మాజీ శాసనసభ్యులు వంగవీటి రాధాకృష్ణ, సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు, బంధుమిత్రులు, పోలీసు శాఖ ఉన్నతాధికారులు, విశ్రాంత ఐపీఎస్ అధికారులు, వివిధ రాజకీయ పక్షాల నేతలు విచ్చేసి, పృథ్వీనారాయణ భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. బుధవారం ఉదయం విజయవాడలో అంత్యక్రియలు జరగనున్నాయని విశ్రాంత పోలీసు ఉన్నతాధికారి వెంకట నారాయణ తెలిపారు.

## నాటుదాం! మొక్కలను



మొక్కలను నాటుదాం
తరువులను పెంచుదాం
ఒక్కింత శ్రద్ధపెట్టి
పచ్చదనం పంచుదాం
కరువులను తరుముదాం
వానలను కురిపిద్దాం
అడవులను కాపాడి
జనులకు మేలు చేద్దాం
బాధ్యతగా తలంచి
జనాలను ప్రోగేసి
ఎండలను తగ్గిద్దాం
వనాలను పెంచేసి
ప్రాణదాతలు తరువులు
మనోహరమే మొక్కలు
పుడమితల్లికి అందం
మానవాళికి బంధం
మొక్కలాగ ఒదుగుదాం
జీవితాన ఎదుగుదాం
పదిమందికి సాయపడి
చుక్కలాగ వెలుగుదాం
అతిముఖ్యము ఆదర్శం
అవసరము ఆనందం
ఉంటేనే పచ్చదనం
హృదయాలకు ఆహ్లాదం

**గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు

# శీలంవారిపాలెం రామాలయంలో దొంగతనం.

**రూ. 4లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు ఆపహరణ.**





**ఘంటసాల: అవనిగడ్డ: మార్చి 11 (వార్తాప్రభ ప్రతినిధి)**ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామ పంచాయతీ శివారు శీలంవారిపాలెంలో వేంచేసియున్న శ్రీ కోదండ రామాలయంలో దొంగతనం జరిగింది .స్థానికులు అందించిన వివరాల మేరకు శీలంవారిపాలెం రామాలయంలో మైక్ పెట్టడానికి కమిటీ సభ్యులు, పూజలు నిర్వహించడానికి అర్చకులు ముక్తేవి విష్ణువర్ధన్ యధావిధిగా ఉదయం ఆలయానికి వెళ్లేసరికి దేవాలయం తలుపులు తెరచి వున్నాయి.అనుమానం వచ్చి పరిశీలించగా రామాలయం మెయిన్ గేట్, అంతరాలయం తలుపుల తాళాలు పగలుగొట్టి ఉండటంతో పాటు ఆలయంలో సామానులు చిందరవందరగా ఉండటంతో దొంగతనం జరిగినట్లు గుర్తించారు . ఇతర కమిటీ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు.సమాచారం అందుకున్న ఘంటసాల ఎస్సై కె.ప్రతాప్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.ఆలయం లోని సీతా రాములు, లక్ష్మణుడు, హనుమంతుడుకు ఉన్న నాలుగు వెండి కిరీటాలు, సీతమ్మ వారి రెండు సూత్రాలు ఉన్న బంగారు మంగళసూత్రం, రాముల వారికి వేసిన వెండి జద్యం, వెండి బొట్టు, పళ్లెం, వెండి తుటారం (శటగోపం) సుమారు రూ. 4 లక్షలు విలువైన వస్తువులు ఆపహరణకు గురైనట్లు కమిటీ సభ్యులు పిర్యాదులో పేర్కొన్నారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మచిలీపట్నం నుంచి క్లూస్ టీమ్ ను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు.

# విద్యార్థి ఉద్యమ నేత నేటి కలం యోధుల నేతగా....

**టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎండి సలీమ్ పాషా.**

**ప్రగతి రిసార్ట్స్ లో జరిగిన జిల్లా మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నిక.**

**హాజరైన మాజీ జాతీయ అధ్యక్షులు దేవులపల్లి అమర్,జాతీయ కార్యదర్శి నరేందర్ రెడ్డి,రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు విరహత్ అలీ,రామ్ నారాయణ,శ్రీకాంత్ రెడ్డి.**



హైదరాబాద్ జి మార్చి 11 (వార్తాప్రభ ప్రతినిధి)తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం రంగారెడ్డి జిల్లా నూతన అధ్యక్షునిగా సీనియర్ జర్నలిస్ట్ ఎండి సలీమ్ పాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.శంకర్ పల్లి మండలం పొద్ద టూర్ గ్రామ పరిధిలో గల ప్రగతి రిసార్ట్స్ లో టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా మహాసభలు అట్టహాసంగా జరిగాయి.ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా శేరిలింగంపల్లి నియోజకవర్గ మన తెలంగాణ స్టాఫ్ రిపోర్టర్ ఎండి సలీమ్ పాషా ఎన్నికయ్యారు.2000 సంవత్సరం నుండి వార్త,నమస్తే తెలంగాణ,సూర్యపత్రికలలో రిపోర్టర్ గా పనిచేసి ప్రస్తుతం మన తెలంగాణ పత్రికలో స్టాఫ్ రిపోర్టర్ గా పనిచేస్తున్నారు.యూనియన్ లో రాష్ట్ర,జాతీయ కౌన్సిల్ సభ్యునిగా,సోషల్ మీడియా ప్రచార కమిటీ సభ్యునిగా పనిచేశారు.ఉస్మానియా యూనివర్సిటీ నుండి బీకాం,బీసీజే,ఎల్ ఎల్ బి,ఎల్ఎల్ఎం,కాకతీయ యూనివర్సిటీ నుండి ఎంసిజే పూర్తి చేసిన సలీమ్ పాషా విద్యార్థి ఉద్యమ నేతగా, తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేశారు. వైజ్ మెన్ లాంటి స్వచ్ఛంద సంస్థలలో సైతం సెంట్రల్ ఇండియా రీజన్ లో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులతో సత్సంబంధాలు ఉండటంతో సలీమ్ ను జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**జర్నలిస్టుల గొంతుకగా పనిచేస్తా.....సలీమ్ పాషా** తనను రంగారెడ్డి జిల్లా జర్నలిస్టుల సంఘం అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.అదేవిధంగా ప్రెస్ అకాడమీ చైర్మన్,ఐజేయూ జాతీయ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి గారికి, మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్ గారికి,జాతీయ కార్యదర్శి నరేందర్ రెడ్డి గారికి,రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ గారికి,ప్రధాన కార్యదర్శి రాం నారాయణ గారికి,కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి గార్లకు ధన్యవాదాలు తెలిపారు.ఏకగ్రీవంగా ఎన్నికవ్వటానికి సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. జర్నలిస్టుల గొంతుకగా పనిచేస్తూ,వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

**అభినందనల వెల్లువ** జిల్లా యూనియన్ నూతన అధ్యక్షుడిగా సలీమ్ పాషా ఎన్నిక పట్ల జిల్లాలోని పలు నియోజకవర్గాల ప్రెస్ క్లబ్ ల తరుపున శుభాకాంక్షలు తెలిపారు. ఎల్ బి నగర్,మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల, షాద్ నగర్,కల్వకుర్తి నియోజకవర్గాల జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొండ విజయ్ కుమార్, చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షులు యాదయ్య, శంకర్ పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి మల్లికార్జున్,జిలానీలు శుభాకాంక్షలు తెలిపారు.

## యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**హనుమాన్ జంక్షన్, మార్చ్ 11(వార్తాప్రభ)**బాపులపాడు మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హై స్కూల్ వీరవల్లి నందు ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ప్రధానోపాధ్యాయుని పి నిర్మల అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాపులపాడు జడ్పిటిసి సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని హాజరై మండల సీనియర్ ఉపాధ్యాయుల ఏ పార్వతీదేవి, పి చెల్లమ్మ, ఎల్ ఉమాదేవి, జె ఆర్ ఎం సరోజినీ లను ఘనంగా సన్మానించారు. గంగాభవాని మాట్లాడుతూ సమాజానికి దిక్సూచి ఉపాధ్యాయులు, ఆధునిక మహిళలు ఎన్నో విజయాలు సాధించినప్పటికీ కొన్ని అసౌకర్య పరిస్థితులు కూడా ఎదుర్కొంటున్నారని ప్రతి ఒక్క మహిళా ఉపాధ్యాయిని తమ విద్యార్థిని విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తూ,మహిళలను గౌరవించే లక్షణాన్ని పాఠశాల స్థాయిలోనే పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి యూటీఎఫ్ అధ్యక్షురాలు శ్రీమతి పి జగతి, సహాధ్యక్షురాలు లీలాసుగుణ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వెలమర్తి రవిబాబు మండలం ప్రధాన కార్యదర్శి దొనే శ్రీహరి, సీనియర్ యుటిఎఫ్ ఎమ్మెస్సార్ ప్రసాద్, మానుకోండ రమణ గోపాల్, వేమూరి అబ్రహం రాజు,దారపురెడ్డి భాస్కరరావు,బి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# డివిజన్ లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా - కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



**శేరిలింగంపల్లి,మార్చి 11 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని టీఎన్జీవోస్ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు కాలనీ వాసులు తో సమావేశమై ఎక్కడ ఉన్నా సమస్యలు అడిగి తెలుసుకునీ నెలకొన్న సమస్యలపై సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా తమ కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన యూజీడీ పైప్ లైన్ నిర్మాణము పనులను పూర్తి చేయాలని,మంచి నీటి వసతిని మెరుగుపర్చాలని,విధి దీపాలు సక్రమంగా పనిచేసేలా చూడలని,పారిశుధ్యం పనులు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ని కోరారు.దీంతో అక్కడే ఉన్న అధికారులకు ఆయా సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై అధికారులతో చర్చించారు.అందుకు కావలసిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం తమ కాలనీలో ఉన్న పార్క్ స్థలంలో ఓపెన్ జిమ్,చిల్డ్రన్స్ పార్క్, క్రీడా ప్రాంగణం,మరియు విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ని కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ లో అసంపూర్తిగా మిగిలిపోయిన యూజీడీ పైప్ లైన్ పనులను మరియు రోడ్లను త్వరితగతిన పూర్తి చేస్తామని,మంజీర మంచీ నీటి వసతిని మెరుగుపరుస్తామని,దశల వారిగా అన్ని పనులు పూర్తి చేసి టీఎన్జీవోస్ కాలనీ లో చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని తెలియచేసారు.పెరుగుతున్న జనాభా దృశ్య భూగర్భ డ్రెయినేజీ పైప్ లైన్ దయా పెంచి లెవల్స్ తో అనుసంధానం చేస్తూ ఒక్క కాలనీ నుండి మరొక కాలనీ కి మధ్యన ఇబ్బందులు తల్లెత్తకుండ పనులు ప్రణాళిక బద్ధంగా అన్ని కాలనీలకు దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం నరేందర్ రెడ్డి,డిఈ విసాలాక్షి, జి.హెచ్.ఎం.సి అధికారులు,డివిజన్ నాయకులు,టీఎన్జీవోస్ కాలనీ కమిటీ సభ్యులు,కాలనీ వాసులు,సీనియర్ నాయకులు స్థానిక నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురం బహిరంగ సభకు భారీగా తరలి వెళ్దాం

**కాని విని ఎరుగని రీతిలో బహిరంగ సభ**

**జనసేన అక్కల రామమోహన్ రావు (గాంధీ)**

**చలో పిఠాపురం బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ**




ఇబ్రహీంపట్నం, మార్చి 11 (వార్తా ప్రభ ప్రతినిధి):మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ అక్కల రామమోహనరావు (గాంధీ) మరియు జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆధ్వర్యంలో కొండపల్లి తన నివాసంలో చలో పిఠాపురం బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కల రామ్మోహన్ రావు (గాంధీ) మాట్లాడుతూఛలో పిఠాపురం జనసేనా పార్టీ 12 వ ఆవిర్భావ దినోత్సవం పిఠాపురం లో ఏర్పాటు చేయడం జరిగిందని, జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ 2014లో పార్టీ పెట్టి మరి 10 సంవత్సరాలలో నిరంతంగా ప్రజా సమస్యల మీద పోరాటం చేసి ఈరోజు ఒక ఎన్డీఏ కూటమిని ఏర్పాటుచేసి ఆ కూటమి ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు.ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు పూర్తయింది అని, కూటమి ప్రభుత్వం



ప్రజా సంక్షేమ ఒకపక్క, అభివృద్ధిని చేసుకుంటూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని రెండు కళ్ళుగా చూసుకుంటూ ముందుకు తీసుకెళ్తున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి,అలాగే జనసేన పార్టీ బలోపేతం దిశగా ఆవిర్భావ దినోత్సవం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.కనివిని ఎరుగని రీతిలో బహిరంగ సభ జరుగుతుందని,అన్ని రకాల ఏర్పాట్లు చేయటం జరిగింది అని మహిళలకు ,రైతులకు ,అలాగే చేతి వృత్తి దారులు కి సెపరేట్ గ్యాలరీలు ఏర్పాటు చేశారని ,యవతి ,యవకులకి ప్రత్యేక గ్యాలరీ ,దూరం నుంచి వచ్చే వారికి సౌకర్యాలు మరియు 4 మార్గాళ్ళల్లో తిరిగి వెళ్ళే వారి కార్యకర్తలకు భద్రత కల్పించి భోజన ఏర్పాట్లు కల్పించటం జరుగుతుందని తెలిపారు.పవన్‌కళ్యాణ్ డిప్యూటీ సిఎం అయిన తరువాత జరిగే ఈ సభకి పటిష్ట ఏర్పాట్లు చేశారని ,మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారని మీడియాకు వెల్లడించారు.గతంలో మైలవరం నియోజకవర్గం నుంచి తిరుపతి , వైజాగ్,అనంతపురం జన సైనికులు మరియు వీర మహిళలు దిగ్విజయం చేశారని, అదే విధముగా పిఠాపురం బహిరంగ సభలు కూడా విజయవంతం చేస్తారని ,కేంద్రంలో నరేంద్ర మోడీ రాష్ట్రంలో చంద్రబాబునాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సారథ్యంలో ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బొలిశెట్టి శ్రీకాంత్, ఎర్రం శెట్టి నాని, బాబి, చింతల లక్ష్మి, చెల్లు కోటేశ్వరావు, స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గా ఆంజనేయులు నామినేషన్



**పెనమలూరు మార్చి 11 (వార్త ప్రభ ప్రతినిధి )**జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ గా వి. వి. పి. ఎస్. ఆంజనేయలు మంగళవారం నాడు 2025 - 2026 సంవత్సరం కు గాను నామినేషన్ దాఖలు చేసారు.ప్రస్తుతం ఆంజనేయులు జిల్లా వైస్ గవర్నర్ గా పని చేస్తున్నారు.కానూరు గ్రామానికి చెందిన ఆయన లయన్స్ క్లబ్ ఉత్తమ సేవలు అందించారు. నామినేషన్ యొక్క కార్యక్రమం లో విజయవాడ లయన్స్ క్లబ్ కృత్రిమ అవయవల విభాగం కోర్డినేటర్ జ్యోసుల శ్రీరామ్ పవన్ లయన్ క్లబ్ సభ్యులు, తదితరులు పలుగోన్నారు.

# దుర్గం చెరువు ను స్వచ్ఛమైన నీటితో తీర్చిదిద్దాలి-బల్దియా కమిషనర్ ఆదేశం



**శేరిలింగంపల్లి,మార్చి 11 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి ఐటి జోన్లో అత్యంత కీలకమైన దుర్గం చెరువును స్వచ్ఛమైన నీటితో కళకళలాడేలా తీర్చిదిద్దాలని బల్దియా కమీషనర్ ఇలంబర్తి స్పష్టం చేశారు.చెరువులోకి చేరే మురుగునీటికి పూర్తిగా చెక్ పెట్టి, వర్షపు నీరు వచ్చేలా పూర్తిస్థాయి వ్యవస్థను అభివృద్ధి పరచాలని అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని దుర్గం చెరువును జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి,జలమండలి,ఎస్ ఎన్డిపి విభాగాల అధికారులతో కలిసి కమిషనర్ మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా జలమండలి చేపట్టనున్న మురుగునీటి డైవర్షన్ నిర్మాణ పనులపై సంబంధిత అధికారులతో చర్చించారు.ఎస్ ఎన్ డి పి ఆధ్వర్యంలో చేపడుతున్న స్ట్రామ్ వాటర్ లైన్ పురోగతిని ఆయన పరిశీలించారు.అనంతరం బల్దియా కమీషనర్ ఇలంబర్తి మాట్లాడుతూ మురుగనీటిని దారి మళ్లించేలా పటిష్టమైన డ్రైనేజీల నిర్మాణానికి సమర్థవంతమైన ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు.భవిష్యత్తులోనూ మురుగునీటి పరిమాణాన్ని తట్టుకునేలా తగినంత మోతాదులో పైపుల నిర్మాణాన్ని చేపట్టాలన్నారు.వర్షపు నీరు స్ట్రామ్ వాటర్ డ్రైనేజ్ ద్వారా చెరువులోకి చేరేలా పటిష్టమైన నాన్యమైన నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.దుర్గం చెరువు లో పరిశుభ్రమైన జలాలు నింపి ఆహ్లాదకరమైన పరిసరాలను నగర ప్రజానీకానికి అందించేలా పటిష్ట కార్యాచరణతో ముందుకు సాగాలని కమీషనర్ తెలిపారు.పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జోనల్ కమిషనర్,సంబంధిత విభాగాల అధికారులను బల్దియా కమిషనర్ ఇలంబర్తి ఆదేశించారు.

# ఎన్టీపిసిలో భద్రతకు అధిక ప్రాధాన్యం!!

***"వికసిత్ భారత్" పారిశ్రామిక రంగం అభివృద్ధిలో కీలక పాత్ర***

***ప్రతి ఉద్యోగి, కార్మికుడు సంస్థ మనుగడ కోసం పనిచేయాలి***

***సమిష్టి కృషితో ఎన్నో అవార్డులు సాధించగలం***

***ఎన్టీపిసి ప్రాజెక్టు హెడ్ చందన్ కుమార్ సమంత***




**పెద్దపల్లి ఎన్టీపిసి: మార్చి 11 (వార్తాప్రభ ప్రతినిధి)** ఎన్టీపిసిలో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎన్టీపిసి ప్రాజెక్టు హెడ్ చందన్ కుమార్ సమంత తెలిపారు. ఈ మేరకు మంగళవారం రామగుండం, తెలంగాణ 54వ జాతీయ భద్రత వారోత్సవపు ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ హెడ్ సమంత మాట్లాడుతూ....."వికసిత్ భారత్" పారిశ్రామిక రంగం అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఉద్యోగి, కార్మికుడు సంస్థ మనుగడ కోసం పనిచేయాలి అని సూచించారు. సమిష్టి కృషితో అవార్డులు సాధ్యమని అన్నారు. ఈ సందర్భంగా సేఫ్టీ డిజిఎమ్ బహేకర్ స్వాగతం పలికి, ఏజీఎం చక్రవర్తి భద్రత నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు భద్రతా యొక్క ప్రాముఖ్యతను, భద్రత సంస్కృతిని క్లుప్తంగా వివరించారు.

# రైల్వే వ్యాగన్ వర్క్ షాపులో మహిళా కార్మికుల పాత్ర మరువలేనిది

**- ఎంప్లాయీస్ సంఘ్ బ్రాంచ్ కార్యదర్శి గద్దా సురేష్**

**ఇబ్రహీంపట్నం, మార్చి 11 (వార్తా ప్రభ ప్రతినిధి):** రైల్వే వ్యాగన్ వర్క్ షాపులో మహిళా కార్మికుల పాత్ర మరువలేనిదని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ బ్రాంచ్ కార్యదర్శి, వర్క్ షాప్స్ డిప్యూటీ డివిజనల్ సెక్రటరీ గద్దా సురేష్ అన్నారు. గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్ షాపు ఎంప్లాయీస్ సంఘ్ కార్యాలయ ఆవరణలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్క్ షాపులో మహిళా కార్మికులకు సంఘ్ ముందుండి వసతులు కల్పించిందన్నారు. మహిళా కార్మికుల సంక్షేమ, వారి అవసరాలను వర్క్ షాపు సీడబ్ల్యూఎం, సంఘ్ జనరల్ సెక్రటరీ మర్రి రాఘవయ్య దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. వర్క్ షాప్ సీడబ్ల్యూఎం ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళా కార్మికుల సమస్యలపై సంఘ్ చేస్తున్న పోరాటాలను, మహిళలకు వారు చేస్తున్న సేవలను కొనియాడారు. తన దృష్టికి వచ్చిన సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వర్క్ షాప్ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు లీలా శ్రీనివాస్, యూపీఎస్ సీ అండ్ సీఏ (ఈసీవో), డీడీ సప్తగిరి వ్యాఖ్యాత చంద్రికా జమాన ప్రసంగించారు. కార్యక్రమానికి బ్రాంచ్ అధ్యక్షుడు పామర్తి శివ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. వర్కింగ్ చైర్మన్ డి.డేవిడ్ రాజు, కోశాధికారి పి.విమల్ సాయి, జి.సుధాకర్, ఎస్.బోయాజ్, కె.లాలియా నాయక్, ఆర్.నాగమద్దయ్య, ఎం.డి.రబ్బాని, కె.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



# మహిళలు సృష్టిలో సగభాగం

**పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలు మామిడాల యశస్విని ఝాన్సీ రెడ్డి**




**తొర్రూర్ మార్చి 11(వార్తా ప్రభ)**మహిళలు సృష్టిలో సగభాగమని సమాజంలో మహిళ వ్యక్తి కాదు ఒక శక్తి అని పాలకుర్తి నియోజకవర్గం శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం తొర్రూరు మండలం సన్నూరు ఎక్స్ రోడ్డు వద్ద రెడ్డి ఫంక్షన్ హాల్ లో, వేట ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు అనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాల్గొని మాట్లాడుతూ సమాజానికి నిలువెత్తు ప్రేరణగా పురుషులకంటే తక్కువ కాకుండా, అన్ని రంగాల్లో మహిళలు తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారని తెలిపారు. ప్రతి మహిళ తన లక్ష్యాలను సాధించేందుకు ధైర్యంగా ముందుకెళ్లాలి, ఎలాంటి అడ్డంకులైనా ఎదుర్కొని, విజయాన్ని సాధించగలరని సూచించారు.మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంస్కరణలకు తోడ్పాటు కోసం సమాజంలో మహిళల భద్రత, ఆర్థిక స్వావలంబన, విద్య, ఆరోగ్యం వంటి అంశాల్లో మరిన్ని సంస్కరణలు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వేట ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు అనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారత అనేది కుటుంబాల అభివృద్ధికి పునాది అన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ముందుకు సాగితే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు.. ఈ వేడుకను మహిళల ప్రగతికి సోపానాలు కావాలన్నారు., మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని కోరారు. వేట ఫౌండేషన్ మహిళల అభివృద్ధికి కృషి చేస్తుందని వారికి శిక్షణ, ఉపాధి అవకాశాలు, మద్దతు వంటి సేవలు అందిస్తామని తెలిపారు. సమాజంలో మార్పు రావాలంటే మహిళల భాగస్వామ్యం పెరగాలి %-% అందుకు కుటుంబం, సమాజం అందరూ సహకరించాలని కోరారు. భవిష్యత్తులో మహిళలకు మరింత సహాయం చేయడానికి వేట ఫౌండేషన్ సిద్ధంగా ఉంది - మహిళా సాధికారత కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు.వైద్య, విద్య, క్రీడా, రాజకీయ, సేవా రంగాల్లో గుర్తింపు పొందిన మహిళలతో తమ అనుభవాలను పంచుకున్నారు. సమాజంలో మహిళలకు మరింత ప్రోత్సాహం అవసరమని పురుషులతో సమానంగా అవకాశాలు దొరకాలని అభిప్రాయపడ్డారు. దానికి అటు ప్రభుత్వం ఇటు స్వచ్ఛంద సంస్థలు మరింత మద్దతు ఇవ్వాలి ఆమె కోరారు. అనంతరం మహిళా మణులకు శాలువలతో సన్మానం చేసి, అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి హాజరైన మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అధికారులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు మండల ముఖ్య కార్యకర్తలు వివిధ మండలాల మహిళా మణులు తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడ లో ప్రజా చైతన్య యాత్ర..

● ఎన్టీఆర్ కాలనీలో సిపిఎం నాయకుల పర్యటన..




**గుడివాడ,మార్చి 11 (వార్తాప్రభ) :** ప్రజా చైతన్య యాత్ర లో భాగంగా సిపిఎం నాయకులు స్థానిక ఎన్టీఆర్ కాలనీలో పర్యటించారు. ఈ క్రమంలో ప్రజల వద్దకు వెళ్లి కరెంట్ బిల్లు ఎలా ఉన్నాయి అని పలకరించారు. గత ప్రభుత్వం కన్నా రెట్టింపు బిల్లులు వస్తున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కూడా సరిగ్గా లేని పరిస్థితుల్లో కరెంట్ బిల్లులు అధికంగా వస్తే ఎలా జీవించగలమని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చే ముందు బాదుడే బాదుడు అనే కార్యక్రమం గత ప్రభుత్వాన్ని విమర్శించారు అన్నారు. అయితే ప్రజల్ని చైతన్యవంతం చేసి అధికారంలోకి వచ్చిన వెంటనే కరెంటు సర్ చార్జీలు సర్దుబాటు చార్జీలు, టూల్ ఆఫ్ చార్జీలు తగ్గిస్తావని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 16 వేల కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై అన్నారు. తక్షణమే ప్రభుత్వం పెంచిన కరెంటు చార్జీలను తగ్గించాలని స్థానిక మహిళలు, సిపిఎం పార్టీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఆర్ సి పి రెడ్డి, మండల కమిటీ సభ్యులు పి రజిని, పార్టీ సభ్యులు ఆర్ కొండా, ఎల్ సురేంద్ర, కృష్ణ కిషోర్, కోసూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 'యువత పోరు' ధర్నా పోస్టర్లు ఆవిష్కరించిన వైఎస్ఆర్సిపి నాయకులు

● కూటమి ప్రభుత్వ మోసాలను మీడియా సమావేశంలో ఎండగట్టిన నాయకులు..



**గుడివాడ,మార్చి 11 (వార్తాప్రభ) :** ఎన్నికల హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని వైసీపీ నేతలు తీవ్ర విమర్శలు చేశారు. స్థానిక భయ్యా వారి వీధిలోని వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మండలి హనుమంతరావు, ఎంపీపీ పెయ్యల ఆదాం, జిల్లా అధికార ప్రతినిధి ఎంవి నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు పాలేటి చంటి, వెంపటి సైమన్, రూరల్ మండలం అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ సయ్యద్ తదితర నాయకులు మీడియాతో మాట్లాడారు. ముందుగా ఈ నెల12వ తేదీ బుధవారం ఉదయం మచిలీపట్నంలో నిర్వహించే యువత పోరు ధర్నా పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్ మెంట్, నిరుద్యోగ భృతిపై చంద్రబాబు సర్కారు మాట తప్పిందని మండిపడ్డారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో వసతి దీవెన బకాయిలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయన్నారు. విద్యార్థులు చదువుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారనీ, పేద విద్యార్థులు వ్యవసాయ బాట పట్టే విషమ పరిస్థితిని కల్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వంపై పోరాడేందుకు 'యువత పోరు' పేరిట నిరసన కార్యక్రమం చేస్తున్నామని నాయకులు పేర్కొన్నారు. మచిలీపట్నంలోని కలెక్టరేట్ ఎదుట నిర్వహించే 'యువత పోరు' ధర్నాలో యువతరం పాల్గొనాలని నాయకులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల ఖాళీ, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తులిమిలి యషయ్య, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు వెంపటి సైమన్, గుడివాడ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాజి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ తోట రాజేష్, గుడివాడ వైఎస్ఆర్సిపి నాయకులు మాదాసు వెంకటలక్ష్మి, లోయ రాజేష్, కొంకితల అంజనేయ ప్రసాద్, చుండూరి శేఖర్, రమణ కుమార్, అగస్త్యరాజు కృష్ణ మోహన్, మూడెడ్ల ఉమా, పుల్లేటికుర్తి కృష్ణా రావు (పెద్దారెడ్డి), జ్యోతుల మణికంఠ, నాగబాబు, సురేఖ, సునీత, రమిజా, సమోసా నాని, చుండి బాబీ, మామిళ్ళ ఎలీషా, దుడ్డు చిన్నా, ఘంటా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిస్వార్థ స్నేహానికి నిలువెత్తు ప్రతిరూపం తాడిపర్తి



**గుడివాడ,మార్చి 11 (వార్తాప్రభ) :** నిస్వార్థ స్నేహానికి నిలువెత్తు ప్రతిరూపం తాడిపర్తి శ్రీనివాస్ అని ఫ్రెండ్స్ ప్రోగ్రెసివ్ ఫ్రంట్ కన్వీనర్ డిఆర్పీ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక కొత్త వారి వీధిలోని ఆయన ఇంటి వద్ద మిత్ర బృందం ఆధ్వర్యంలో శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించి బర్త్‌డే కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ ప్రసాద్ మాట్లాడుతూ జెసి అధ్యక్షులుగా ఆ సంస్థ అభివృద్ధికి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన శ్రీనివాస్ సమాజం పట్ల బాధ్యతతో పలు సేవా కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. ఈ సందర్భంగా మిత్రబృందం ఆధ్వర్యంలో శ్రీనివాసు, లక్ష్మీ సుజాత దంపతులను దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు టీవీ రమణ సునీత దంపతులు, ప్రముఖ న్యాయవాది వై రవీంద్రనాథ్, ఎన్జీవో యూనిట్ జిల్లా నాయకులు షేక్ ఫరీద్ భాష, మహావీర్ జైన్, నవభారత్ ఖాది స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, జెసి ఉరిటి రామారావు, రావూరి వెంకటేశ్వర్లు, రమణ భక్తులు ఆశూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలలో ఎగ్జామినేషన్ కిడ్స్ పంపిణీ







**గుంటూరుమార్చి 11 (వార్తాప్రభ) :** గుంటూరు జిల్లా, జొన్నలగడ్డ రూరల్ లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 10 వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు మోటివేషనల్ స్పీచ్ తో పాటు పరీక్షలకు అవసరమైన ఎగ్జామినేషన్ కిడ్స్ పంపిణీ కార్యక్రమం వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్ మరియు శ్రీ కృష్ణ అకాడమీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పాశం శ్రీకృష్ణదేవరాయ యాదవ్ మాట్లాడుతూ నిన్న నుంచి నేర్చుకో, నేటి కోసం జీవించు, రేపటి గురించి ఆశించు. జీవితం అనే యుద్ధంలో గెలవడానికి ధైర్యాన్ని మించిన ఆయుధం లేదు. చీమను చూసి క్రమశిక్షణ, భూమిని చూసి ఓర్పును ప్రతి ఒక్క విద్యార్థి నేర్చుకోవాలని అన్నారు. పరీక్షలు సమయం సమీపిస్తున్న కొద్దీ విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. ఆశించిన మార్కులు వస్తాయో లేదో అని భయపడుతుంటారు. ఇలాంటి సమయంలో విద్యార్థులు సానుకూల దృక్పథంతో ఆలోచిస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. ట్రస్టు సభ్యులు మరియు ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం అధ్యక్షులు కుర్ర శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా మంచి మార్కులు సాధిస్తారు. పరీక్షలు రాసేటప్పుడు విద్యార్థులకు ఎదురయ్యే సమస్యలు ఏమిటంటే కొంత మంది విద్యార్థులు పరీక్ష మొదలైనప్పుడు లేదా ప్రశ్నపత్రాన్ని చూసినప్పుడు ఆందోళన చెందుతుంటారు. తెలిసిన సమాధానాలు మరిచిపోతానేమోనని భయం కలుగుతుంది. కొన్ని ప్రశ్నలు చాలా లోతుగా అర్థం కాకుండా వస్తాయి. వాటిని అర్థం చేసుకోవడానికి ఇబ్బందిపడుతారు. ఒత్తిడి వల్ల చదివిన అంశాలు పరీక్ష సమయంలో గుర్తుకు రాకపోవచ్చు అన్నారు. ట్రస్ట్ సభ్యులు పాశం సర్దార్ అభినంద్ యాదవ్ మాట్లాడుతూ విద్యా మునుగడ కోసం మాత్రమే కాకుండా అవగాహనను పెంపొందించే సాధనం కావాలి. పిల్లలు వికసించి గొప్పగా తయారవ్వాలని అలాగే తమ ట్రస్ట్ చేసే కార్యక్రమాలలో భాగంగా పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, ఎగ్జామినేషన్ కిడ్స్, బాగా చదువుకొని మెరిట్ మార్క్స్ సాధించిన విద్యార్థులకు స్కాలర్షిప్ వంటి కార్యక్రమాల నిర్వహించడం. విద్యార్థులు తమలో ఉన్న బద్ధకం వదులుకొని చదువు పట్ల శ్రద్ధ పెట్టి మంచి భవిష్యత్తు పొంది, భవిష్యత్తులో మంచి ఉద్యోగం సాధించారన్నారు. ట్రస్ట్ సభ్యులు కోనంకి మురళీకృష్ణ యాదవ్ మాట్లాడుతూ చాణిక్యుడు విద్యార్థుల మనసును బాగా అర్థం చేసుకున్నాడు. చాణక్య నీతి ప్రకారం విద్యార్థి జీవితం ఉత్తమ సమయం, మంచి భవిష్యత్తుకు పునాది వేస్తుంది. అందుకే ఈ జీవితాన్ని చాలా జాగ్రత్తగా గడిపితేనే భవిష్యత్తుకు భద్రత ఉంటుంది. విద్యార్థుల కోసం చాణిక్యుడు చెప్పిన మాటలు నిద్ర కంట్రోల్ లో ఉండాలి, అతి చేయకూడదు, కోపం అదుపులో ఉంచుకోవాలి, అత్యాశ అసలు ఉండకూడదు, అందం పై మాత్రమే దృష్టి పెట్టకూడదు, సోమరితనమే అతి పెద్ద శత్రువు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వాలంటీర్స్ ఆనంది కృష్ణ తేజ యాదవ్, ఉమేష్ చంద్ర, సత్యా, వినాయక్ మరియు పాఠశాల సిబ్బంది జాసన్, రాజేశ్వరి, విజయ, శ్రీదేవి మరియు కృష్ణకుమారి పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ చేయూత



**గుడివాడ,మార్చి 11 (వార్తాప్రభ) :** బందరు పట్టణం మూడు స్తంభాల సెంటర్ లో జరిగిన అగ్నిప్రమాదం తో గ్యాస్ సిలిండర్ పేలి సర్వం కోల్పోయిన సిహెచ్ జయలక్ష్మి, పి పార్వతి, కే నాగమణి కుటుంబాలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కృష్ణాజిల్లా శాఖ తరపున సెక్రటరీ భవిరి శంకర్ నాథ్, జిల్లా ట్రెజరర్ కొండపల్లి రాం బాలాజీ డిజాస్టర్ మేనేజ్మెంట్ కన్వీనర్ కే కృష్ణ తేజ లు బాధితులకు తాత్కాలిక నివాసం కొరకు టార్పాలిన్, వంట పాత్రలు, సబ్బులు పేస్టులు వాటితో కూడిన హైజెన్ కిట్స్, దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోన నాగార్జున, రెడ్ క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ హరికృష్ణ, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఎన్నార్ కళాశాల విద్యార్థికి బంగారు పతకం



**గుడివాడ,మార్చి 11 (వార్తాప్రభ) :** ఏలూరు జిల్లా చింతలపూడి గ్రామంలో జరిగిన మిస్టర్ ఆంధ్ర ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ పోటీలలో స్థానిక అక్కినేని నాగేశ్వరావు కళాశాల విద్యార్థి నత్తా నితీష్ కుమార్ ఎమ్మెసి కెమిస్ట్రీ ద్వితీయ సంవత్సరం 75 కిలోల శారీరక బరువు బాడీ బిల్డింగ్ విభాగంలో బంగారు పతకం సాధించాడని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి జె ఎస్ కుమార్ తెలియజేశారు, ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ ప్రెసిడెంట్ ఎల్.ఆర్.కే. ప్రసాద్ సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ కే.ఏస్. అప్పారావు, వైస్ ప్రిన్సిపల్ శ్రీమతి బి .ఎస్.ఎస్. పద్మజ, ఫిజికల్ డైరెక్టర్ వీర్ల గోపి లు విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీల అభివృద్ధి సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యం -కొల్లి రమ్యశ్రీ




**గుడివాడ,మార్చి 11 (వార్తాప్రభ) :** అంగన్వాడి సంక్షేమం అభివృద్ధియే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తుందని గతంలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అంగన్వాడీల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అంగన్వాడీ ద్వాక్రా గుడివాడ నియోజకవర్గ అధ్యక్షురాలు కొల్లి రమ్యశ్రీ అన్నారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని తెలుగుదేశం పార్టీ (ప్రజావేదిక) కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రమ్యశ్రీ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలోని సుమారు లక్షా పదిహేనువేల మంది అంగన్వాడీల యొక్క మనోభావాలను పరిగణలోనికి తీసుకొని గ్రాడ్యుటిని అమలుచేసి 62 సం॥లు వయోపరిమితిని పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిది అన్నారు. గత వైకాపా పాలనలో అంగన్వాడీలు 43 రోజులు రోడ్లమీద నిరసన దీక్షలు చేసినా కూడా జగన్ రెడ్డి నుండి ఎటువంటి హామీ కానీ స్పందన కానీ లేదనీ, పైగా మీ నిరసనలు నిర్వీర్యం చేసి ఎస్మా చట్టం ఉపయోగించి మిమ్మల్ని అన్ని రకాలుగా నిర్బంధించి ఇబ్బంది పెట్టి మోసం చేసిన ఘనుడు జగన్ రెడ్డి అని విమర్శించారు. గత ఐదు సం.లలో ఒక్క రూపాయి కూడా మీకు జీతం పెంచకపోగా తెలంగాణతో పాటు మీకు జీతాలిస్తానని మాట ఇచ్చిన జగన్ రెడ్డి మిమ్మల్ని మోసం చేసిన పరిస్థితి వాస్తవం కాదా..? అన్నారు. చివరికి అంగన్వాడీల స్కూళ్ళని, అంగన్వాడీల వ్యవస్థనే నిర్వీర్యం చేసారని అన్నారు. ఏ ప్రభుత్వంలో మీకు న్యాయం జరిగిందో అంగన్వాడీలు ఆలోచించుకోవాలని, మీకు ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తెలుగునాడు అంగన్వాడీ ట్రేడ్ యూనియన్ తో పాటుగా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది అన్నారు. మీ సమస్యలు చర్చల ద్వారా పరిష్కరించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో మచిలీపట్నం పార్లమెంటరి నియోజకవర్గ ద్వాక్రా అంగన్వాడి ఆర్గనైజింగ్ సెక్రటరీ మాదాల సునీత, నిర్మలకుమారీ లు పాల్గొన్నారు.

# అవనిగడ్డ ట్రెజరీలో నిధుల గోల్ మాల్ ఉదంతంలో ఇద్దరు సస్పెన్షన్..




**అవనిగడ్డ,మార్చి 11 (వార్తాప్రభ) :** కలకలం రేకెత్తించిన అవనిగడ్డ సబ్ ట్రెజరీ కార్యాలయంలో నిధుల గోల్ మాల్ ఉదంతంలో ఆ శాఖాధికారులు ఎట్టకేలకు ఇద్దరు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు వేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నకిలీ బిల్లులతో కోట్లలో ప్రజాధనాన్ని దారి మళ్ళించి అక్రమాలకు పాల్పడ్డారన్న కాగ్ నివేదికతో అప్రమత్తమైన రాష్ట్ర ఆర్థిక శాఖ జిల్లా ట్రెజరీ అధికారులను విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించడంతో ఆగమేఘాలపై తనిఖీలు చేపట్టిన జిల్లా ట్రెజరీ అధికారులు కోటీ యాభై ఎనిమిది లక్షల రూపాయలకు పైగా ప్రజాధనం దారి మళ్ళించినట్లు గుర్తించి సీనియర్ అకౌంటెంట్ వెంకట రెడ్డి ని , సకాలంలో అక్రమాన్ని గుర్తించలేదన్న కారణంతో ఎస్ టి ఓ ఆదిశేషు పై సస్పెన్షన్ వేటు వేశారు. గతంలో ఎస్ టి ఓ గా పనిచేసిన రమేష్ కుమార్ ను డిప్యుటేషన్ పై అవనిగడ్డ ఎస్ టి ఓ గా నియమించారు.

**అక్రమాలపై అవనిగడ్డ పోలీసులకు ఫిర్యాదు...** నకిలీ బిల్లులతో రూ 1,58,44,569 ల ప్రభుత్వ నిధులు తన బ్యాంకు ఖాతాకు,తన బంధువుల బ్యాంకు ఖాతాలకు అక్రమంగా జమ చేయించారని అవనిగడ్డ సబ్ ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్ గా పనిచేస్తున్న టి.వెంకటరెడ్డిపై అవనిగడ్డ పోలీసు స్టేషన్ లో జిల్లా ట్రెజరీ అండ్ అకౌంట్స్ అధికారి ఎస్.రవికుమార్ ఫిర్యాదు చేశారు. 2022 జులై నుంచి అవనిగడ్డ సబ్ ట్రెజరీ కార్యాలయంలో వెంకట రెడ్డి పనిచేస్తున్నారని 2023 జులై నుంచి సెప్టెంబర్ వరకు మూడు నెలల స్వల్ప కాలంలోనే సిఎఫ్ ఎంఎస్ ఫేజ్ 1%ద%2 మధ్య ఉన్న సమన్వయ లోపాన్ని సీనియర్ అకౌంటెంట్ వెంకట రెడ్డి తనకు అనుకూలంగా మలుచుకుని 22 క్లైములలో అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వానికి రూ 1.58 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని , దీనిలో రూ 1.50కోట్లను నాలుగు ఖాతాలకు మళ్ళించినట్లు విచారణలో వెల్లడైందని ఫిర్యాదులో పేర్కొన్నారు. సీనియర్ అకౌంటెంట్ వెంకట రెడ్డి తన వ్యక్తిగత ఖాతాలో ?60,99,286లు , ఆయన భార్య శ్రీముఖి ఖాతాలో ? 56,78,253లు ,తన ఇంటికి సమీపంలో టీ దుకాణం నడుపుకునే టి.వి.కిషోర్ పట్వాల్ ఖాతాలో ? 5,04,266లు ,చందు కళ్యాణి అనే మరో మహిళ ఖాతాలో ? 27,63,804లను జమ చేసినట్లు విచారణలో గుర్తించినట్లు జిల్లా ట్రెజరీ అండ్ అకౌంట్స్ అధికారి రవికుమార్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

**మరి కొందరి పాత్రపై అనుమానాలు...** అవనిగడ్డ సబ్ ట్రెజరీ కార్యాలయ ఆడిట్ నివేదిక పరిశీలనా నంతరం కంట్రోలర్ అండ్ ఆడిటింగ్ జనరల్ (కాగ్) పసిగట్టిన ప్రభుత్వ నిధుల దారిమళ్ళింపు దందాలో విచారణ అనంతరం అక్రమాలకు పాల్పడ్డారని సీనియర్ అకౌంటెంట్ వెంకట రెడ్డి, సకాలంలో గుర్తించలేదని ఎస్ టి ఓ ఆదిశేషులపై ఆశాఖ ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేసి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇదే వ్యవహారంలో మరికొందరి పాత్రపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతశ్రేణికి చెందిన కొంతమంది భరోసా , అండదండలు లభించకుండా కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనం అక్రమంగా దారిమళ్ళించడం అంత సులభం కాదని, పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి రావచ్చని అదే సమయంలో మరికొందరి ప్రమేయం బహిర్గతమయ్యే అవకాశముంటుందని అభిప్రాయపడుతున్నారు. ఈ మొత్తం వ్యవహారం ఉన్నతాధికారులు ఎలా ముగిస్తారోనని పలువురు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



గుడివాడ టౌన్ 10వ వార్డ్ నందు జరిగిన దావత్-ఏ-ఇఫ్తార్ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్దు శ్రీకాంత్ గారు.. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముజహిద్, జునైద్, జానీ షరీఫ్, ఇబ్రహీం, సయ్యద్ జబీన్, మున్వార్, రఫి, నూర్, శుకూర్, ప్రజావేదిక ఇంచార్జి గుల్లంకి ప్రదీప్, దుర్గాప్రసాద్, మత పెద్దలు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

-గుడివాడ,మార్చి 11 (వార్తాప్రభ) :

# ఆహారం - ఆరోగ్యం పై అవగాహన సదస్సు



**తిరుపతి ,మార్చి 11 (వార్తాప్రభ) :** శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాల లో ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఒక అవగాహనా కార్యక్రమంలో డాక్టర్ ఎన్. టి. ఆర్. వైద్య విశ్వ విద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ మరియు గుంటూరు వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె. శంకర్ ఆహారమే ఔషధ అన్న అంశం మీద ప్రసంగించారు. ఆహారం- ఆరోగ్యం విషయంలో ఉన్న అనేక అపోహలను , అనారోగ్యాన్ని నివారించడానికి ఆహారం విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఆయన అనేక విషయాలను ప్రస్తావించారు. ముఖ్యంగా డయాబెటిస్ నివారణలో సరి అయిన ఆహార అలవాట్లు ఎంత మేలు చేస్తాయో ఆయన ఉదాహారణలతో వివరించారు. అంతే కాకుండా కాన్సర్ వంటి భయంకర వ్యాధులకు ప్లాస్టిక్ బాటిల్స్, అలాగే ఇతర ఆహార అలవాట్లు ఎలా కారకమవుతున్నాయో కూడా తెలిపారు. అలాగే నియమిత కాలవ్యవధి ఉపవాసాలతో ఎటువంటి సత్ఫలితాలను సాధించవచో కూడా తెలిపారు. ఈ కార్యక్రమంలో రుయా ఆసుపత్రి పూర్వ సూపరింటెండెంట్ డాక్టర్ భారతి , కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ కిరీటి , డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, డాక్టర్ మాధవీలత, డాక్టర్ డీ. ఎస్. మూర్తి , ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ ఆశాలత , ఇతర వైద్య అధ్యాపక సిబ్బంది, పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# అన్నదానం కు 25 వేలు విరాళం..



**పెనుగంచిప్రోలు, మార్చి 11 (వార్తాప్రభ) :** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయం లో జరుగు అన్నదా నంకు కటకంశెట్టి బాల సైదులు మూడు బొమ్మల సెంటర్ నగరపాలెం గుంటూరు వాస్తవ్యులు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయం లో అన్నదానమునకు రూ.25.000 (ఇరవై ఐదు వేల రూపాయలు) విరాళంగా మంగళవారం ఆలయ అధికారులకు అందజేయడం జరిగింది. వారికి దేవస్థానం తరుపున దర్శనం కల్పించి ఆశీర్వచనం చేసి శేష వస్త్రాలు తీర్థప్రసాదాలు అందించడం జరిగినది.

# దేశంలో మతోన్మాద శక్తులు తాండవిస్తున్నాయి

● కాంగ్రెస్ ఓబిసి జాతీయ చైర్మన్ అజయ్ సింగ్ యాదవ్ ఆందోళన ● నేషనల్ చైర్మన్ సమక్షంలో 26 జిల్లాల ఓబీసీ చైర్మన్ ల ప్రమాణ స్వీకారం




**విజయవాడ,మార్చి 11 (వార్తాప్రభ) :** కాంగ్రెస్ పార్టీ నేషనల్ ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ అజయ్ సింగ్ యాదవ్ స్టేట్ ఓబిసి చైర్మన్ నాగరాజు నాయకత్వంలో మంగళవారం విజయవాడ ఆంధ్ర రత్న భవన్లో 26 జిల్లాల చైర్మన్ లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అజయ్ సింగ్ యాదవ్ మాట్లాడుతూ మతోన్మాద శక్తులు దేశంలో ఎక్కువ అవుతున్నారని రాజ్యాంగ విరుద్ధంగా పరిపాలన సాగుతుందని అజయ్ సింగ్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేసారు. దేశంలో ఏకైక వ్యక్తి రాహుల్ గాంధీ ఒక్కరే ఈ గాడ్జిల్లాల మీద పోరాటం చేస్తున్నారని వివరించారు. అమిత్ షా మోడీ అదానీ అంబానీల మీద పోరాటం చేస్తూ దేశ సంపదంత ఇద్దరు వ్యక్తులకు కట్టబడుతున్నటువంటి అమీత్షా ని మోడీని గద్దించే విధంగా దేశ ప్రజలు చైతన్య అవ్వాలని పిలుపునిచ్చారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు దేశంలో రక్షణ లేదని కేవలం హిందూ మతాన్ని అడ్డుపెట్టుకుని మిగతా కులాల వారిని హింసను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు అలాగే ఎన్నికల వ్యవస్థని నిర్వీర్యం చేస్తూ రాజ్యాంగానికి విరుద్ధంగా పరిపాలన చేస్తున్నారని జాతీయ ఓబీసీ చైర్మన్ కెప్టెన్ అజయ్ సింగ్ అన్నారు దానిలో భాగంగానే ఆంధ్ర రాష్ట్రంలో ఓబీసీ చైర్మన్గా తక్కువ టైంలో బాధ్యతలు స్వీకరించి 26 జిల్లాల చైర్మన్ లు 175 నియోజకవర్గాల చైర్మన్ లు ప్రమాణ స్వీకారం చేయించడం చాలా సంతోషకరంగా ఉందని ఆయన అన్నారు కాంగ్రెస్ పార్టీ సి డబ్ల్యూ సి మెంబర్ మాజీ పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ అని 2029 లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావటం ఖాయమని అన్నారు. కచ్చితంగా ఆంధ్రప్రదేశ్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుందని షర్మిల రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో ఉద్యమాలు ఉంటాయన్నారు. ఓబీసీ డిపార్ట్మెంట్ చైర్మన్ నాగరాజు ఆధ్వర్యంలో ఇంత పెద్ద కార్యక్రమం చేయడం చాలా సంతోషకరమని గిడుగు రుద్దరాజు అన్నారు రాష్ట్ర ఓబిసి చైర్మన్ నాగరాజ్ మాట్లాడుతూ త్వరలో అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి ఆధ్వర్యంలో లక్ష మందితో ఓ బీసీ మహాసభ పెడతానని చెప్పారు. ఇప్పటికీ 26 జిల్లాలు 175 నియోజకవర్గాల చైర్మన్ పదవులు పూర్తి అయ్యాయని అన్నారు. త్వరలో 692 మండలాలు 26,286 పైచిలుకు గ్రామాల కమిటీ లను త్వరలో పూర్తిచేసి లక్ష జనాభాతో కాంగ్రెస్ ఓబీసీ సభ విజయవాడలో ఏర్పాటు చేస్తామనినాగరాజు తెలిపారు. రాష్ట్రం అంతట కూడా బీసీ లని ఏకతాటిపైకి తీసుకు వచ్చి బీసీ హక్కుల కోసం నిత్యం పోరాటం చేస్తాను అనిఅన్నారు. రాష్ట్రం అంతట కూడా బీసీ లని మోసం చేసి ప్రభుత్వం కాలం వెళ్లదీస్తుందన్నారు. బీసీల సమస్యలను తీర్చే నాథుడే లేకుండా పోయాడు అనిఅన్నారు. ఇది ఇలానే కొనసాగితే రాష్ట్రం అంతటా ఉద్యమాలు చెయ్యవలసి వస్తున్నది అని తెలియచేస్తూ ఈ కార్యక్రమానికి 26 జిల్లాల నుంచి వచ్చిన చైర్మన్ కి అలాగే కెప్టెన్ అజయ్ సింగ్ రుద్రరాజు అలాగే నేషనల్ కోఆర్డినేటర్ కన్వీనర్ నాగరాజు శ్రీనివాస్ యాదవ్ కర్నాటక ఇంచార్జ్ మురళీకృష్ణ కి తదిత నాయకులకు ధన్యవాదాలు తెలియజేసారు.

